Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైయిటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 256 విశాఖపట్నం, 27 జూలై 2024 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## పోలవరంపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ



**అమరావతి:** 2014-19 మధ్య పెట్టుబడులకు చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపామని సీఎం చంద్రబాబు అన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించామని.. రూ.16లక్షల కోట్లకు ఎంవోయూలు కుదుర్చుకున్నామని చెప్పారు. రూ.5లక్షల కోట్లతో పరిశ్రమల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. వైకాపా హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై శాసనసభలో ఆయన శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్ర విభజన నుంచి వైకాపా పాలన వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించారు.

"విభజన జరిగినప్పుడు చాలా సమస్యలు వచ్చాయి. గతంలో పింఛన్లు కూడా రావనే పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో ఆదాయం తక్కువ వస్తోంది. సమైక్యాంధ్రప్రదేశ్‌లో ఏపీకి 46 శాతం, తెలంగాణకు 54 శాతం ఆదాయం వచ్చింది. కంపెనీలు, ఆస్తులు హైదరాబాద్‌లో ఉన్నాయి. పునర్విభజన చట్టంలోని షెడ్యూల్

(మిగతా 2లో)

## కార్గిల్ విజయం చిరస్మరణీయం



కార్గిల్.. ప్రతి భారతీయుడి గుండెల నిండా చెరగని ముద్ర వేసిన పేరు. సరిహద్దులను దాటుకుని అక్రమంగా మనదేశంలోకి చొరబడ్డ పాకిస్తాన్ సైన్యాన్ని, మిలిటెంట్లను భారతీయ జవాన్లు తరిమి కొట్టిన ప్రాంతం అది. కార్గిల్‌ను విడిపించుకునే క్రమంలో యుద్ధం చేసింది భారత్. ఈ క్రమంలో 500 మందికి పైగా యుద్ధ వీరులను కోల్పోయిన ప్రదేశం అది.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం (జూలై 26) కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లోని ద్రాస్‌కు చేరుకున్నారు.

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ప్రధాని మోదీ వార్ మెమోరియల్ వద్దకు చేరుకుని పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన జవాన్లకు ఘన నివాళులర్పించారు. కార్గిల్ నుంచి పాకిస్థాన్ దుష్ట ప్రణాళికలు ఎప్పటికీ ఫలించవని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 1999 యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా నేడు దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నాం.

లడఖ్‌లోని షింకున్ లా టన్నెల్ ప్రాజెక్టును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ లేహ్‌కు అన్ని ప్రాంతాలను కనెక్టివిటీని అందిస్తుంది. ఇది పూర్తయితే, ఇది ప్రపంచంలోనే ఎత్తైన సొరంగం అవుతుంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం లడఖ్‌పై ఎక్కువ దృష్టి సారించింది. ఇక్కడ అనేక ప్రధాన రహదారులకు మరమ్మతులు చేసి కొత్త రోడ్లు, వంతెనలు నిర్మించారు.

కార్గిల్‌లో అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. దేశం కోసం చేసిన త్యాగాలు అజరామరమని కార్గిల్ విజయ్ దివస్ చెబుతోందన్నారు. రోజులు, నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాలు కూడా గడిచిపోతున్నాయి. దేశాన్ని రక్షించడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టిన ప్రజలు మనం యుద్ధంలో గెలవడమే కాదు, సత్యం, సంయమనం, శక్తికి అద్భుతమైన ఉదాహరణనిచ్చామన్నారు.

కార్గిల్ యుద్ధ సమయంలో ఒక సాధారణ దేశస్థుడిలా సైనికుల మధ్య ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు ప్రధాని మోదీ. ఈరోజు మళ్లీ కార్గిల్ భూమిపైకి వచ్చినప్పుడు ఆ జ్ఞాపకాలు మదిలో మెదులడం సహజం. మన బలగాలు ఇంత కష్టతరమైన యుద్ధాన్ని ఎలా నిర్వహించాయి, మాతృభూమిని రక్షించడానికి అత్యున్నత త్యాగం చేసిన అమరవీరులకు వందనం చేస్తున్నాను అంటూ ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. మరోవైపు పాకిస్థాన్‌పై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కార్గిల్‌లో యుద్ధంలో విజయం సాధించడమే కాదు, సత్యం, సంయమనం, బలాన్ని అద్భుతంగా ప్రదర్శించామన్నారు. ఆ సమయంలో భారతదేశం శాంతి కోసం ప్రయత్నిస్తోంది. దానికి ప్రతిగా పాకిస్తాన్ తన వక్రబుద్ధి చూపించింది. కానీ నిజం ముందు అబద్ధం, భీభత్సం ఓడిపోయాయన్నారు ప్రధాని మోదీ.

పాకిస్థాన్ గతంలో చేసిన అన్ని నీచ ప్రయత్నాలలో విఫలమైంది. వక్ర బుద్ధి మార్చుకోని పాకిస్తాన్ దాని చరిత్ర నుండి ఏమీ నేర్చుకోలేకపోయింది. అది ఉగ్రవాదం, ప్రాక్సీ వార్

(మిగతా 2లో)

## పెళ్లి పేరుతో మోసగిస్తున్న అందమైన అమ్మాయిలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): సైబర్ క్రైమ్ సీఐ కే.భవాని ప్రసాద్ మీడి యాతో మాట్లాడుతూ చెప్పారు. వైజాగ్ లో సైబర్ క్రైమ్ రోల్ ప్రధానమైనది. డేటింగ్ యాప్ లో పరిచయం అయ్యి పెళ్లి చేసుకుంటాం అని ఇలా అనేక కేసులు గత కొద్ది రోజులుగా నమోదు అవుతున్నాయి. అందమైన అమ్మాయి ఫోటో పంపించగానే అబ్బాయిలు నమ్మి మోసపోతున్నారు. మోసపోయిన అబ్బాయి నుంచి లక్షలు తీసుకుంటూ వాళ్ళను మోసం చేస్తున్నారు. కొత్త సీపీ ఆదేశాలు మేరకు ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో స్పీడ్ పెంచడం పెంచి నిందితులను త్వరితగతిన పట్టుకోవడం జరుగుతుంది. పెద్ద వయసు ఉన్న వారికి కొత్త నెంబర్లతో న్యూడ్ వీడియో కాల్స్ అనేవి రావడం ఈ మధ్య కాలంలో కేసులు నమోదు అవుతున్నాయి. అలాగే పెళ్లి చేసుకుంటాం అని నమ్మించి అంద మైన అమ్మాయి ఫోటో పెట్టి మోసాలు చేస్తున్నారు. అలాగే ఆన్లైన్ లో ఉండే డేటింగ్ యాప్స్ మాయలో పడి ఎక్కువగా యువత మోసపోతున్నారు. అతి తక్కువ సమయం లో డబ్బు సంపాదించాలి అనే ఇలాంటి మార్గాలు ఎంచుకుంటున్నారు. ఎవరైనా సరే సైబర్ నేరగాళ్ల చేతిలో పడితే వెంటనే మమ్మల్ని సంప్రదించండి.

(మిగతా 2లో)

## బెంగాల్, కేరళ గవర్నర్లకు సుప్రీం నోటీసులు..!



భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కేరళ ప్రభుత్వ పిటిషన్‌పై కేరళ గవర్నర్ అదనపు ప్రధాన కార్యదర్శికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్ వ్యవహారంలో సంబంధిత ప్రతివాదికి కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒక పార్టీగా వాదించేందుకు కూడా కోర్టు స్వేచ్ఛ ఇచ్చింది. మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని సంబంధిత ప్రతివాదిని కోర్టు ఆదేశించింది.

పశ్చిమ బెంగాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టు ముందు వాదనలు వినిపిస్తూ.. ఇలాంటి కేసులను కోర్టు

(మిగతా 2లో)

## కవితకు మరోసారీ నిరాశే



మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన ఎమ్మెల్సీ కవిత ఇప్పట్లో బయటకు వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈడీ, సీబీఐ వద్ద బలమైన సాక్ష్యాలు ఉండడంతో కవిత బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవుతున్నాయని. తాజాగా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ ఇచ్చింది. ఇదే కేసులో అరెస్టైన ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌తో సహా మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని సైతం పొడిగించింది.

రౌస్ అవెన్యూ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసులో వారికి ఈ నెల 31 వరకు రిమాండ్‌ను పొడిగించింది. మరోవైపు సీబీఐ పిటిషన్ దాఖలు చేసిన కేసులో వాదనలు విన్న కోర్టు ఆగస్టు 8 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కవితను జైలు అధికారులు కోర్టు ఎదుట హాజరుపరిచారు.

సీబీఐ కేసులో డీఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత వేసిన పిటిషన్ పై జులై 22న రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. విచారణలో భాగంగా కవితపై సీబీఐ వేసిన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. జులై 26న కవితను వర్చువల్‌గా కోర్టులో హాజరుపర్చాలని సీబీఐని ఆదేశించగా ఈ రోజు కవితను హాజరు పరిచారు. కవిత సహా మరో నలుగురి పాత్రపై జూన్ 7న సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది.

కాగా కేసీఆర్ మొదటి సారిగా కవిత అరెస్ట్ పై గురువారం స్పందించారు. కుట్ర చేసి తన కూతురిని అరెస్ట్ చేశారని.. దీనిపై సరైన సమయంలో స్పందిస్తా అని పేర్కొన్నారు. మరోవైపు మీ కూతురు తప్పు చేయకపోతే ఇన్ని రోజులు జైలులో ఎందుకుంటుందని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కాగా ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్లి 100 రోజులు దాటిపోయింది. కొద్ది రోజుల క్రితం ఆమె స్వల్ప అస్వస్థకు గురైతే ఆస్పత్రిలో చికిత్స చేయించి జైలుకు తరలించారు.

## కుప్పంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభించిన నారా భువనేశ్వరి



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇవాళ ఆమె కుప్పంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలోని మహిళల కోసం ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ఈ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. నేడు ఈ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం సందర్భంగా నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన తండ్రి, దివంగత ఎన్టీఆర్ కు నివాళులు అర్పించారు. ప్రారంభోత్సవం అనంతరం ఆమె మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్టు ముందుకు కొనసాగుతుందని అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టును చంద్రబాబు సేవా భావంతో స్థాపించారని వెల్లడించారు.

"చంద్రబాబు ఏ స్ఫూర్తితో ట్రస్టును స్థాపించారో... ఆ స్ఫూర్తిని నేను, నా సిబ్బంది ముందుకు తీసుకెళుతున్నాం. కుప్పంలో ఈ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేశాం. మహిళలకు బట్టలు కుట్టడం నేర్పిస్తే వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడతారని మేం భావిస్తున్నాం.

కేవలం కుట్టు మిషన్లతోనే మేము ఈ కార్యక్రమాలు ఆపడం లేదు... మరిన్ని ఆలోచనలు ఉన్నాయి. దుస్తుల ఫ్యాక్టరీల వారితో మాట్లాడుతున్నాం... వారికి ఏ మోడల్ దుస్తులు కావాలో వాటిని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లో శిక్షణ పొందిన వారితో కుట్టించి ఫ్యాక్టరీకి అమ్మేలా చర్యలు తీసుకుంటున్నాం.

అంతేకాదు... వైర్ బుట్టలు, ఇతర చేతి పనుల్లో ఏమైతే మహిళలకు ఆసక్తి ఉంటుందో వాటిలో కూడా శిక్షణ ఇచ్చి ముందుకు తీసుకెళతాం. శిక్షణ తీసుకున్న మహిళలకు కోపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి వారిని మరింత ముందుకు తీసుకెళతాం. మహిళలు తమ

(మిగతా 2లో)

## సైనికుల త్యాగాలను యువతరం గుర్తుంచుకోవాలి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): దేశ ప్రజల రక్షణ, బధ్రత కోసం వీరోచిత పోరాటాలు చేస్తూ, ప్రాణాలను సైతం అర్పిస్తున్న వీర సైనికుల త్యాగాలను యువతరం ఎప్పుడూ గుర్తుచేసుకోవాలని ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఏయూ విద్య విభాగంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రతీ పౌరుడు దేశం పట్ల ప్రేమ కలిగి ఉండాలన్నారు. దేశ భక్తిని నరనరాల్లో నింపుకుని జీవనం సాగిం చాలన్నారు. దేశ బధ్రత కోసం కుటుం బాలను వదిలి దేశ సరిహద్దుల్లో నిత్యం పహారా కాసే సైనికులకు మనమంతా కృత జ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. భారత దేశ చరిత్ర పుటల్లో కార్గిల్ యు ద్ధానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎందరో సైనికుల త్యాగాల ఫలితంగా మనం

(మిగతా 2లో)

## మదనపల్లె ఘటనలో మాధవరెడ్డి పరారీ: సిసోడియా



ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మదనపల్లె నుంచి విజయవాడ వెళుతూ రాయ చోటిలోని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ను సందర్శించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సిసోడియా సమావేశమయ్యారు. రెవెన్యూ శాఖ రికార్డులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ, మదనపల్లెలో ఫైళ్ల దగ్ధం ఘటనపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. మాధవరెడ్డి అనే వ్యక్తి ఇప్పటికే పరారీలో ఉన్నాడని, మదనపల్లె ఘటనలో నాలుగు బృందాలు విచారణలో పాలుపంచుకుంటున్నాయని వివరించారు.

ఈ ఘటనలో ఏడుగురిని విచారిస్తున్నామని సిసోడియా వెల్లడించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక వస్తే అనేక వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ఘటన జరిగిన కార్యాలయంలో పనిచేసే కొందరు సిబ్బందిపై అనుమానం ఉందని తెలిపారు. త్వరలో శాఖాపరమైన చర్యలు చేపడతామని, కొందరు ఉద్యోగులపై

(మిగతా 2లో)

## తెదేపా శ్వేత పత్రాలపై జగన్ అసహనం



ఏపీలో అరాచకపాలన సాగుతోందంటూ.. డిల్లీ స్థాయిలో గొంతెత్తిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి ఏపీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతున్నారు. రాష్ట్రం పురోగతి రివర్స్‌లో నడుస్తోందని ఎద్దేవా చేశారు. గత 52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం కొనసాగుతోందని ఆరోపించారు. ప్రశ్నించే వాళ్లను అణచివేసే ధోరణితో చంద్రబాబు పాలన సాగుతోందని మండిపడ్డారు. విధ్వంస పాలన కొనసాగుతుంటే.. పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. చంద్రబాబు అరాచక పాలనపై పోరాటానికి వైఎస్సార్ సిద్ధంగా ఉందని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బడ్జెట్ కూడా పెట్టలేని అధ్వానమైన స్థితిలో చంద్రబాబు సర్కార్ ఉందని ధ్వజమెత్తారు. ఏడు నెలల ఓటాన్ బడ్జెట్ పెడుతోంది. పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టే ధైర్యం బాబు ప్రభుత్వానికి లేదంటే, పాలన ఎంతటి అధ్వాన్నస్థితిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు జగన్. చంద్రబాబు మోసపూరిత హామీలు కేటాయింపులు చూపించలేకనే బడ్జెట్ పెట్టలేకపోతుందని విరుచుకుపడ్డారు. రాష్ట్రం క్లిష్టపరిస్థితుల్లో ఉందని చంద్రబాబు గ్యాంగ్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థికస్థితి బాగులేకనే పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదని వైఎస్ జగన్ విమర్శించారు.

శ్వేత పత్రాలతో రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జూన్ దాకా చంద్రబాబు ప్రభుత్వం

(మిగతా 2లో)

## 2034 నాటికి అలాంటి ఉద్యోగాలు ఉండవ్.. లింక్డిన్ వ్యవస్థాపకుడి అంచనా



కాలం గడుస్తున్నకొద్దీ ఉద్యోగాల తీరు, పని విధానాల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొవిడ్ సంక్షోభం తర్వాత కంపెనీల నిర్వహణలో అనూహ్య పరిణామాలు జరిగాయి. ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేయడం దగ్గర నుంచి కీలక సమావేశాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరిగిపోవడం వరకు పలు మార్పులు చూశాం. తాజాగా కృత్రిమ మేధ అందుబాటులోకి రావటంతో భవిష్యత్తులో ఇంకా ఎలాంటి కొత్త ధోరణులు రానున్నాయోననే ఆసక్తి నెలకొంది. ఈ తరుణంలో ప్రముఖ సామాజిక మాధ్యమం లింక్డిన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్‌కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఏతరహా ఉద్యోగాలు ఉంటాయో చెప్పి సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చకే తెరతీశారు.

టెక్ రంగంలో విస్తృత అనుభవం ఉన్న హాఫ్‌మన్ గతంలో చేసిన పలు అంచనాలు నిజమయ్యాయి. సామాజిక మాధ్యమాలకు విపరీతమైన ఆదరణ రానుందని ఆయన ముందే పసిగట్టారు. అలాగే గిగ్ ఎకానమీ ఊపందుకుంటుందని చాలాకాలం క్రితమే అంచనా వేశారు. కృత్రిమ మేధ విప్లవం రానుందని 1997లోనే చెప్పారు. తాజాగా.. ప్రస్తుతం ఉన్న 9-5 ఉద్యోగాలు అంటే ఉదయం వచ్చి సాయంత్రం ఇంటికెళ్లే సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగవుతాయని అంచనా వేశారు. రాబోయే రోజుల్లో ఉద్యోగులు ఒకే దగ్గర, ఒకే విధిని నిర్వర్తించబోరని తెలిపారు. ఒకే సమయంలో వివిధ కంపెనీలకు రకరకాల పనులు చేసే రోజులు రానున్నాయని చెప్పారు.

2034 నాటికి ఇప్పుడున్న సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగవుతాయని హాఫ్‌మన్ తెలిపారు. దీనివల్ల అవకాశాలతో పాటు, సవాళ్లూ ఉంటాయని వివరించారు. స్థిరమైన ఉద్యోగాలు లేకపోవడం, నిపుణులు దీర్ఘకాలంలో ఒకేచోట పనిచేయడానికి ఇష్టపడక పోవడం వల్ల సమస్యలు తప్పవని తెలిపారు. అదే సమయంలో ఒకే వ్యక్తి వివిధ కంపెనీలకే కాకుండా తన నైపుణ్యాలు, ప్రతిభకు అనుగుణంగా పలు రంగాల్లో రకరకాల విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనివల్ల కంపెనీల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఆతిథ్యరంగం సహా అన్ని సెక్టార్లకు కృత్రిమ మేధ అనుసంధానమవుతుందని హాఫ్‌మన్ అంచనా వేశారు.

## రెడ్ బుక్ తెరవకముందే జగన్ గగ్గోలు పెడుతున్నారు: మంత్రి నారా లోకేశ్

అమరావతి: తప్పు చేసిన వారందరి పేర్లు రెడ్ బుక్‌లో చేర్చి చట్ట ప్రకారం శిక్షిస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రెడ్ బుక్ తెరవక ముందే జగన్ దిల్లీ వెళ్లి గగ్గోలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ ప్రధాని పీవీకి భారతరత్నపై స్పందించమని జగన్‌రెడ్డిని జాతీయ మీడియా కోరితే.. విజయసాయిరెడ్డి పేరు చెప్పి వెళ్లిపోయారని గుర్తు చేశారు. రెడ్ బుక్ విషయంలో మాత్రం జాతీయ మీడియాను బతిమాలి పిలిపించుకుని ప్రచారం కల్పించారన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో రెండు ప్రెస్‌మీట్లు పెట్టిన జగన్.. 11 సీట్లు వచ్చిన నెలలోపే ఐదు ప్రెస్‌మీట్లు పెట్టారని విమర్శించారు. జగన్ చెప్పే అసత్యాలకు.. అసెంబ్లీకి వస్తే వాస్తవాలు చెబుతామన్నారు.

# ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి.. సుందర్ పిచాయ్‌కి గౌరవ డాక్టరేట్



గూగుల్, ఆల్ఫాబెట్ సంస్థల సీఈఓ సుందర్ పిచాయ్ మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. భారత్‌లోని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ వీకే తివారీ, విద్యాసంస్థకు చెందిన ఇతర ప్రతినిధులు ఆయనకు 'ఆనరరీ డాక్టర్ ఆఫ్ సైన్స్'ను అందించారు.

ఈ విషయాన్ని స్వయంగా సుందర్ పిచాయ్ సోషల్ మీడియాలో వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. "నా పూర్వ విద్యా సంస్థ ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి గతవారం గౌరవ డాక్టరేట్ అందుకోవడం చాలా గర్వంగా ఉంది. నేను డాక్టరేట్ పొందాలని నా తల్లిదండ్రులు ఎప్పుడూ ఆశ పడేవారు. ఐఐటీలో నేను నేర్చుకున్న విద్య, సాంకేతికతే ఈ రోజు నన్ను గూగుల్ వరకు తీసుకొచ్చింది. టెక్నాలజీని మరింత ఎక్కువమందికి అందించే స్థాయికి చేర్చింది. ఆ విద్యాసంస్థలో నాకు సమయం గడిపే అవకాశం వచ్చినందుకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటా" అని గూగుల్ సీఈఓ రాసుకొచ్చారు. సంబంధిత ఫొటోలను షేర్ చేశారు.

ఇక, పిచాయ్‌తో పాటు ఆయన సతీమణి అంజలి కూడా ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. కెమికల్ ఇంజినీరింగ్‌లో ఆమె సాధించిన విజయాలకు గానూ 'విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు'ను విద్యా సంస్థ ప్రతినిధులు అందించారు. ఈ కార్యక్రమంలో పిచాయ్ తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

భారత-అమెరికన్ అయిన సుందర్ పిచాయ్.. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికా వెళ్లి స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ అండ్ మెటీరియల్ సైన్స్‌లో ఎంఎస్ చదివారు. 2004లో గూగుల్‌లో చేరి 2015లో కంపెనీ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఐఐటీలో చదువుతుండగానే తన క్లాస్‌మేట్ అంజలిని ప్రేమించి ఆ తర్వాత పెళ్లి చేసుకున్నారు.

# వీడియోల పిచ్చి ముదిరి.. రైలును పట్టాలు తప్పించి..



సోషల్ మీడియాలో తమ వీడియోలు వైరల్ కావాలనే పిచ్చి యువతలో ముదిరిపోయింది. వీడియోలు చిత్రీకరిస్తూ ప్రాణాలు కోల్పోయిన వారి గురించి మనం వార్తల్లో చదువుతూనే ఉన్నాం. కానీ, అమెరికా(%ఖూరా%)లో ఓ కుర్రాడు సోషల్ మీడియాలో వీడియో కోసం ఏకంగా రైలునే పట్టాలు తప్పించాడు.

నెబ్రస్కా రాష్ట్రంలోని లాంక్‌స్టార్ కౌంటలోని ఓ 17 ఏళ్ల కుర్రాడికి యూట్యూబ్‌లో వీడియో వైరల్ చేయాలని కోరిక పుట్టింది. ఇంకేముంది.. ఏప్రిల్‌లో మోన్రోయ్ అనే ప్రాంతం వద్ద ఉన్న రైలు క్రాసింగ్ వద్దకు వెళ్లాడు. అక్కడ రైళ్ల మార్గాలను నిర్దేశించే స్విచ్‌ల లాక్ తీసి వాటిల్లో మార్పులు చేశాడు. సమీపంలో తన కెమెరా ట్రైపాడ్ అమర్చి కాచుకొని కూర్చున్నాడు. ఇంతలో బీఎన్ఎస్ఎఫ్ సంస్థకు చెందిన రెండు లోకోమోటీవ్‌లు, ఐదు బోగీలు వచ్చాయి. ఆ డ్రైవర్ ఏం జరిగిందో గుర్తించే సమయానికి అవి పట్టాలు తప్పాయి.

వెంటనే ఆ బాలుడు రైల్వే అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడికి చేరుకొన్న అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు. కీలక స్విచ్‌లను మార్చినట్లు గుర్తించారు. దీంతో వారికి అనుమానం వచ్చి బాలుడిని విచారించగా.. తాను పట్టాలు తప్పుతున్న రైలు వీడియో చిత్రీకరించినట్లు తెలిపాడు. స్విచ్‌లలో మార్పులతో తనకు సంబంధం లేదని బుకాయించాడు. దీంతో అధికారులు అక్కడి సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. ప్రమాదానికి ముందు వాహనంలో ఓ వ్యక్తి అక్కడికి వచ్చినట్లు గుర్తించారు. అతడు బాలుడితో సరిపోలాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. ఈ ప్రమాదం కారణంగా ఒహామా పబ్లిక్ పవర్ డిస్ట్రిక్ట్‌కు, బీఎన్ఎస్ఎఫ్ రైల్వేకు దాదాపు 3,50,000 డాలర్ల నష్టం వాటిల్లింది. మన కరెన్సీలో అది దాదాపు రూ.2 కోట్లకు పైమాటే.

| | |
|---|---|
| శనివారం 27 -07-2024<br>క్రోధి నామ సంవత్సరము<br>దక్షిణాయణం, గ్రీష్మరుతువు<br>ఆషాఢ మాసం | |
| తిథి | : బ. సప్తమి రా. 01.04 |
| నక్షత్రం | : రేవతి సా. 05.27 |
| వర్జ్యం | : ఉ. 06.15 ల 07.45 |

## కార్గిల్లో భారత విజయం సైనికుల శౌర్యానికి ప్రతీక

### చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతి



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ కార్గిల్లో భారత విజయం మన దేశ సైనికుల సౌర్యానికి ప్రతి కాని అన్నారు.1999, జూలై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా నేడు ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, జులై 26, 1999న పాకిస్థాన్ సైన్యాన్ని తరిమికొడుతూ కార్గిల్‌లో భారతదేశం విజయ పతాకాన్ని ఎగురవేసిందని, అప్పటి నుంచి భారతదేశం ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటుందని వివరించారు. శత్రుదేశంపై విజయం సాధించి నేటికి సరిగ్గా 25 ఏళ్లని, ఈ రోజు భారతదేశాన్ని విజయపథంలో నడిపించిన సైనికుల ధైర్యసాహసాలకు అంకితం చేయబడిందని, దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించే రోజు కూడా ఇదేనని, 1999లో ఇదే రోజున కార్గిల్ మంచు శిఖరాలపై దాదాపు మూడు నెలల పాటు సాయుధ పోరాటం జరిపిన భారత దళాలు పాకిస్థాన్ రేంజర్లపై తమ విజయాన్ని ప్రకటించాయని గుర్తు చేశారు. అనంతరం వీర సైనికులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమణ, కేజీయ, సంతోషి, లీలా పావని, నాయక్, చరిత్ర అధ్యాపకులు నాగేశ్వరరావు, ఈశ్వరరావు, నాగేంద్రబాబు, శ్రీనివాస్, సతీష్, పూర్ణ రావు, నాని, రమణ, ప్రమీల, లైబ్రేరియన్ జగత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

# 17ఏళ్ల నాటి హత్య కేసు.. ఒకే ఫ్యామిలీలో 14మందికి జీవిత ఖైదు

బదౌన్: 17ఏళ్ల నాటి హత్య కేసులో బదౌనీలో ప్రత్యేక కోర్టు జడ్జి సంచలన తీర్పు ఇచ్చారు. 14 మందికి జీవిత ఖైదు, జరిమానా విధించారు. వీరిలో తొమ్మిది మంది ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ జిల్లా ఖర్కోల్ గ్రామంలో పాన్ సింగ్ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో వీరంతా దోషులుగా తేలడంతో ప్రత్యేక జడ్జి రేఖా శర్మ వారందరికీ శిక్షలు ఖరారు చేశారు. వీరిలో ఆరుగురికి రూ.50వేలు, ఎనిమిది మంది దోషులకు రూ.30వేలు చొప్పున జరిమానా విధించారని ప్రభుత్వం తరపు న్యాయవాది వెల్లడించారు.

2007 ఫిబ్రవరిలో కరీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖార్కోల్ గ్రామంలో రాధేశ్యామ్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జరిగిన ఎనిమిది రోజుల తర్వాత అతడి కుటుంబసభ్యులు, బంధువులు పాన్ సింగ్ ఇంటిపై దాడి చేశారు. పోలీసులకు బాధిత కుటుంబం చేసిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. పాన్‌సింగ్ ఇంటి వద్ద బహిరంగ కాల్పులు జరపడంతో పాటు కర్రలతో దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు. ఆ తర్వాత అతడిని గొడ్డలితో నరికి చంపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు 12 మందిపై దోపిడీ, హత్య కేసులు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మరో నలుగురిపైనా ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగానే వీరిలో ఇద్దరు మరణించారు. తాజాగా ఈ కేసు తుది విచారణలో రాధేశ్యామ్ సోదరుడు ఉర్మాన్‌తో పాటు 14మందిని దోషులుగా నిర్ధారించి వారందరికీ జీవిత ఖైదు విధిస్తూ జడ్జి రేఖా శర్మ తీర్పు ఇచ్చారు. దోషులంతా రాధేశ్యామ్ కుటుంబ సభ్యులు లేదా బంధువులే కావడం గమనార్హం.

## (మొదటి పేజీ తరువాయిలు)

### పోలవరంపై అసెంబ్లీ పై సుదీర్ఘ చర్చ

9, 10 సమస్యలు పరిష్కారం కాలేదు. సేవల రంగం అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుంది. సేవల రంగం తెలంగాణకు వెళ్తే ఏపీకి వ్యవసాయం వచ్చింది. రాష్ట్రానికి సుదీర్ఘ తీర ప్రాంతం ఉండటం కలిసివచ్చే అంశం.

అభివృద్ధి చేస్తే ఏపీ కూడా తెలంగాణతో సమానంగా ముందుకెళ్తుంది. పోలవరం పూర్తి చేస్తే ప్రతి ఎకరాకు నీరందుతుది. రూ.1667 కోట్లు ఖర్చు చేసి పట్టిసీమ ప్రాజెక్టు పూర్తి చేశాం. పట్టిసీమ పూర్తి చేయడం వల్ల రూ.44 వేల కోట్ల ఆదాయం వచ్చింది. నాకు పేరొస్తుందని వైకాపా పాలనలో పట్టిసీమను కూడా సరిగా నిర్వహించలేదు. విజయవాడ, రాజమహేంద్రవరం, తిరుపతి, కడప విమానాశ్రయాలు అభివృద్ధి చేశాం. రాష్ట్రంలో 8 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చాం. విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేశాం. ఎన్ని ఇబ్బందులున్నా గతంలో సంక్షేమానికి బడ్జెట్‌లో 34 శాతం ఖర్చు చేశాం. పోలవరం ప్రాజెక్టు కోసం రూ.11,762 కోట్లు కేటాయించాం. తెదేపా అధికారంలో కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తయ్యేది" అని చంద్రబాబు వివరించారు.

### దేశ ప్రజలు గర్వించదగ్గ విజయం

సహాయంతో తనకు తానుగా సంబంధం కలిగి ఉండటానికి ప్రయత్నిస్తోంది. టెర్రర్ మాస్టర్లు నేరుగా వినగలిగే ప్రదేశం నుంచి మాట్లాడుతున్నా.. ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని, వారి దుర్మార్గపు ఉద్దేశాలు ఎప్పుడూ ఫలించవని, మన సైనికులు పూర్తి శక్తితో ఉగ్రవాదాన్ని అణిచివేస్తారని.. శత్రువులకు తగిన సమాధానం ఇస్తారని ఈ ఉగ్రవాద పోషకులకు ప్రధాని మోదీ హెచ్చరించారు.

ఆగస్టు 5వ తేదీకి ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతుందని ప్రధాని మోదీ అన్నారు. జమ్మూ కాశ్మీర్ నేడు కొత్త భవిష్యత్తు గురించి, పెద్ద కలల గురించి ఆలోచిస్తుందన్నారు. జి-20 వంటి గ్లోబల్ సమ్మిట్ ముఖ్యమైన సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వడానికి జమ్మూ కాశ్మీర్ గుర్తింపు పొందింది. జమ్మూ కాశ్మీర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పర్యాటక రంగం కూడా పెరుగుతోంది. లడఖ్ అభివృద్ధికి సంబంధించి, ఈ రోజు లడఖ్‌లో కూడా కొత్త అభివృద్ధి ప్రవాహం సృష్టించబడిందని ప్రధాని మోదీ అన్నారు. శింకున్ లా టన్నెల్ నిర్మాణ పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి. దీని ద్వారా, లడఖ్ ఏడాది పొడవునా మరియు ప్రతి సీజన్‌లో దేశంతో అనుసంధానించబడి ఉంటుంది. ఈ సొరంగం లడఖ్ అభివృద్ధి మరియు మెరుగైన భవిష్యత్తు కోసం కొత్త అవకాశాలకు కొత్త మార్గాలను తెరుస్తుంది.

### ఎళ్ళి పేరుతో మోసగిస్తున్న అందమైన అమ్మాయిలు

ఎక్కువగా వంద శాతంలో సుమారు 80 శాతం వరకు చైనీస్ వాళ్ళు చేసిన మోసాలు ఎక్కువగా చేస్తున్నారు.. ఈ మధ్య కాలంలో వాట్స్ ఆప్ కూడా హ్యాక్ లు అవుతున్నాయి. స్టాక్ మార్కెట్లు యాప్ లు ద్వారా 50 లక్షలు నుంచి కోట్లు నష్టపోతున్నారు...

ఎవరైతే ఆన్లైన్ ద్వారా మోసపోతే గంటలోగా 1930 నంబర్ కు సమాచారం అందిస్తే పోయినా డబ్బును వెనక్కి తీసుకురాగలం. సమయం ఎక్కువ అయితే గంటల్లో అనేక అకౌంట్ లోకి డబ్బు మారిపోతుంది. చాలామంది వైజాగ్ లో బ్యాంక్ అకౌంట్స్ కూడా అమ్ముకుంటున్నారు. ఆ అకౌంట్ల నేరగాళ్లు అనేక నేరాలకు ఉపయోగిస్తారు. ఉచితంగా ఆన్లైన్ లో సినిమాలు చూస్తున్నారు కానీ దాని వెనుక ఎంత నెట్వర్క్ ఉంటుందో మీరు తెలుసుకోవాలి. ఇప్పటికీ నమోదు అవుతున్న కేసుల్లో కొంత డబ్బును కూడా వెనక్కి తీసుకురావడం జరుగుతుంది. పిల్లలు చేతికి ఎక్కువగా ఫోన్లు ఇవ్వకూడదు. వాళ్లకు తెలియకుండా డేటింగ్ యాప్ లోకి వెళ్లి ఆ అమ్మాయి తో చాటింగ్ లు చేస్తున్నారు. ఫ్యామిలీ ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టవద్దు. అన్వాంటెడ్ యాప్ లను ఫోన్స్ లో ఇన్వాల్ చేయకూడదు. మీకు తెలియని లింక్స్ ను కూడా ఓపెన్ చేయకూడదు... తద్వారా దాని వాళ్ల ఫోన్లు కూడా హ్యాక్ అవుతున్నాయి. సుమారు 100 కేసులు సైబర్ నేరగాళ్ల మాయలో మోసపోయామంటూ కేసులు నమోదు అవుతున్నాయి. ఈ ఆన్లైన్ ద్వారా జరుగుతున్న మోసాలు అన్ని కూడా ఇతర దేశాలు నుంచి ఎక్కువగా జరుగుతున్నాయి.

### బెంగాల్, కేరళ గవర్నర్లకు నోటీసులు..!

విచారించినప్పుడల్లా కొన్ని బిల్లులు క్లియర్ అవుతాయి. తమిళనాడు విషయంలోనూ ఇలాంటివి జరిగాయని పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ.. ఎనిమిది నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాదించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 8 బిల్లుల ఆమోదాన్ని నిలుపుదల చేసినందుకు గవర్నర్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఇది ఎవరి సంక్షేమం కోసం బిల్లులు ఆమోదించబడిందో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర నివాసితులపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపున న్యాయవాది ఆస్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. "గవర్నర్ ప్రవర్తన, చట్టబద్ధమైన పాలన, ప్రజాస్వామ్య సుపరిపాలనతో సహా మన రాజ్యాంగం ప్రాథమిక పునాదిని ఓడించి, నాశనం చేసేలా బెదిరించడమే కాకుండా, రాష్ట్ర ప్రజల హక్కులను మరింత ఉల్లంఘించేలా ఉంది. సంక్షేమ చర్యలు బిల్లుల ద్వారా అమలు చేయాలని కోరింది." అని పిటిషనర్ పేర్కొన్నారు.

2022లో ఆమోదం పొందిన 8 బిల్లులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిశ్చలంగా ఉంచారని, దీని ద్వారా రాష్ట్ర శాసనసభ చర్యలకు ఒడిగట్టారని, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర నివాసితుల సంక్షేమం కోసం బిల్లులు ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. "8 కీలక బిల్లులకు సంబంధించి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ లోపభూయిష్టాలు, కమీషన్ల చర్యల వల్ల ఏర్పడిన రాజ్యాంగ సంక్షోభాల వల్ల బాధపడ్డ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం తన అసాధారణ అధికార పరిధిని కోరుతూ పిటిషనర్ ఈ కోర్టును తరలించవలసి ఉంటుంది" అని పిటిషన్ పేర్కొంది.

### కుప్పంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభించిన నారా భువనేశ్వరి

సంపాదనపై సంతృప్తి చెందేలా మేం చర్యలు తీసుకుంటాం. సంతృప్తికర స్థాయిలో సంపాదించేలా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. మహిళలకు బాసటగా నిలబడతాం. కుప్పం నియోజకవర్గంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా స్కూలు ఏర్పాటు చేస్తాం. పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తాం. కుప్పం నియోజకవర్గంలో నిరుద్యోగ మహిళలకు ఉపయోగపడేలా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్ లో పెట్టిన విధంగా ఉచిత ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ను కుప్పంలో పెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం" అని భువనేశ్వరి వివరించారు.

### సైనికుల త్యాగాలను యువతరం గుర్తుంచుకోవాలి

భాతర భూభాగాన్ని ముష్కరుల నుంచి తిరిగి పొందడం జరిగిందన్నారు. ఈ విజయాన్ని అందుకుని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులను మననం చేసుకోవడం, వారి త్యాగాలను గుర్తుచేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధ వీరుల సంస్మరణార్థం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. భారత సైన్యం పాకిస్థాన్‌పై విజయం సాధించిన ఈ రోజును విజయ్ దివస్‌గా దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు.

ఏయూ దూరవిద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, ఆర్మీలో హవాల్దార్ హెచ్‌ఓవి శ్యామల రావు, మహేంధర్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కార్యకమ్రానికి ఏయూ ఎన్ఎస్‌సి అధికారి డాక్టర్ ఎన్.ఎం యుగంధర్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో విభాగ బిఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగరాజ కుమారి, బోధన సిబ్బంది డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

### మదనపల్లె ఘటనలో మాధవరెడ్డి పరారీ: సిసోడియా

సస్పెన్షన్ వేటు పడే అవకాశాలున్నాయని, మరికొందరిని అరెస్ట్ చేసే అవకాశముందని స్పష్టం చేశారు.

మంటల్లో కాలిపోయిన రికార్డుల రికవరీకి అవకాశముందని సిసోడియా పేర్కొన్నారు. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో లావాదేవీల రికార్డులు పరిశీలించామని చెప్పారు. 20 ఏళ్ల తర్వాత డి-పట్టాలు ఫ్రీహోల్డ్ లోకి వెళ్లిపోతాయన్న భావనతోనే ఈ ఘటనకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు కలుగుతున్నాయని వివరించారు.

అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 2.16 లక్షల ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ అయిందని, అందులో 4,400 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని అన్నారు. ఫ్రీహోల్డ్ పై ఆయా జిల్లాల కలెక్టర్లు విచారణ చేపట్టారని సిసోడియా తెలిపారు.

### శ్వేత పత్రాలతో రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టే యత్నం చేస్తున్నారు

తీసుకున్న అప్పులకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైఎస్ జగన్ వివరించారు. చంద్రబాబు కంటే తమ హయంలోనే తక్కువ అప్పులు చేశామని అంటున్నారు మాజీ సీఎం జగన్. మార్చి వరకు ఏపీకి ఉన్న అప్పులు 4 లక్షల 85 వేల కోట్లు అయితే ఒక రిపోర్ట్‌లో 10 లక్షల కోట్లు అని, మరో రిపోర్ట్‌లో 14 లక్షల కోట్లు అప్పు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

విశాఖ సమాచారమ్
శనివారం 27-07-2024

## ఆవు నెయ్యితో అద్భుత పరిష్కారం

మనం తినే పదార్థాల్లో నేతికంటే రుచికరమైంది, ఘుమఘుమలాడేది ఇంకోటి లేదు. ఏ కూర, పచ్చడి వేసుకున్నా కొంచెం నెయ్యి వేసుకుంటే ఆ రుచే వేరు. ఇంత రుచికరమైన, ఖరీదైన నేతిని హెూమాలు, యజ్ఞయాగాదుల్లో వేస్తారని మనందరికీ తెలుసు. అగ్నిలో నేతిని వేయడాన్ని గురించి వేదాలు ఎంతో ఘనంగా వర్ణించాయి. నేతిని "ఆజ్యం" అని "ఘృతం" అని కూడా అంటారు. ఇంతకీ వేదాల్లో ఆజ్యం గురించి ఏం చెప్పారో తెలుసుకుందాం.

వేదాలు ఆవునేతినే శ్రేష్ఠమని చెప్పాయి. గేదె పాలతో తయారైన నేతి కంటే ఆవుపాల నుండి వచ్చిన నేయి ఉత్తమమైంది. ఈ ఆవునేయి లేత పసుపురంగులో ఉంటుంది. తాజా వెన్నను కాచి నేయి తయారుచేస్తారు.

హెూమం, యాగం, యజ్ఞం, అగ్నిహెూత్రాల్లో ఆజ్యం పోయడం దండగని, చాదస్తం అని కొట్టి పడేసేవారున్నారు. నేయి మొదలైన సమిధలను అనవసరంగా అగ్నిలో వేసి తగలెయ్యడమేనని, దీనివల్ల ఒరిగేదేమీ లేకపోగా ఎంతో డబ్బు నష్టమని కొందరు వాదిస్తూ ఉంటారు.

నిజానికి ప్రకృతిలో ఉన్నవన్నీ మన స్వార్థం కోసమే కాదు. కొన్నిటిని తిరిగి ప్రకృతికే అర్పించాలి. అలా చేయడం ఆయా వస్తువులు, పదార్థాలను నిరవర్థకం చేసినట్లనుకుంటే పొరపాటు. ఆయా పదార్థాలను అక్షరాలా సార్థకం చేయడం అవుతుంది. ఇలా అగ్నిదేవునికి ఆహుతి చేయడంవల్ల రెట్టింపు ఫలితం ఉంటుంది.

తరచుగా అగ్ని హెూమాలు చేసి ఆజ్యాన్ని పోయడంవల్ల పొగ వ్యాపిస్తుంది. అది మనలో అనారోగ్యం తలెత్తకుండా చేస్తుంది. అనేక కారణాలవల్ల ఏర్పడే కాలుష్యాన్ని నివారిస్తుంది. అతివృష్టి, అనావృష్టి లాంటి అపసవ్యతలు లేకుండా చేసి వాతావరణ సమతుల్యతకు దారితీస్తుంది. నేతిని అగ్నిలో వేయగా వచ్చే ధూమంవల్ల వాతావరణంలో ఉన్న కాలుష్యం నివారించబడుతుంది. అణుశక్తి కారణంగా జనించే అనేక బాధలు తగ్గుతాయి.

ఘృతాన్ని అగ్నికి సమర్పించడంవల్ల చెట్లు, పశు పక్ష్యాదులకు మేలు జరుగుతుంది. భూమి సారవంతం అవుతుంది. పంటలు సమృద్ధిగా పండుతాయి. స్వచ్ఛమైన గాలి అందుతుంది. హాని చేసే సూక్ష్మ క్రిములు నశిస్తాయి.

అగ్ని హెూమాల్లోని భస్మంతో ఔషధాలు తయారుచేయొచ్చు. యాగాలు చేసిన తర్వాత వచ్చే భస్మాన్ని పంట భూముల్లో చల్లితే ఎరువుగా ఉపయోగపడుతుంది.

అగ్నిలో ఒక మిరపకాయను వేసినట్లయితే గొట్టు వస్తుంది, అది దగ్గు మొదలైన తీవ్ర సమస్యలను తెచ్చిపెడుతుంది. అదే గనుక ఆజ్యం వేసినట్లయితే లోపలి అనారోగ్యాలు నయమౌతాయి.

యజ్ఞయాగాదుల్లో సమిధలు వేయడంవల్ల అదంతా దైవార్పితం చేసినట్లు అవుతుంది. ఒక వస్తువు లేదా పదార్థాన్ని అగ్నికి సమర్పిస్తున్నాం అంటే అందులో మన భక్తిప్రపత్తులు, గౌరవం, కృతజ్ఞత, త్యాగం, ప్రేమ, దయ, నిస్వార్థం, సహనం - ఇన్ని గొప్ప లక్షణాలు మనలో ఉన్నట్లు. వాటన్నిటినీ వ్యక్తం చేస్తున్నాం అన్నమాట.

ఆవునేతిని భోజనంలో కొద్దిగా వేసుకోవడంవల్ల ఆహారం నోటికి మరింత హితవుగా ఉంటుంది. నేతివల్ల గ్రహణశక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పుష్కలంగా ఉంటుంది. బలం చేకూరుతుంది. ఆయుస్సు పెరుగుతుంది. కంటికి శ్రేష్ఠం. శరీరంలో కోమలత్వం వస్తుంది. స్వరం మృదువుగా తయారౌతుంది.వాత పిత్త దోషాలను, జ్వరం, ఉన్మాదం మొదలైన అనారోగ్యాలను తక్షణం పోగొడుతుంది. ఆకలి మందగించినప్పుడు సొంటి పొడి లేదా మిరియాల పొడిలో కాస్త నెయ్యి వేసుకుని తింటే ఆ సమస్య వెంటనే నివారణ అవుతుంది. అరుగుదల బాగుంటుంది. అజీర్తి సమస్యలు తలెత్తవు.

హెూమంలో కల్తీ నెయ్యి లేదా వనస్పతి నెయ్యి వేయడంవల్ల ప్రయోజనం లేదు. మన మహర్షులు స్వచ్ఛమైన ఆవునేతిని యజ్ఞయాగాదులలో ఉపయోగించమని స్పష్టంగా చెప్పారు. అప్పుడే అది ఆశించిన ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఉదకాన్ని వదిలితే అది పితృయజ్ఞం అవుతుంది. పెద్దలు చనిపోయినప్పుడు భూతములకు (దెయ్యాలు, భూతాలూ కావు.. కాకులకు బలి ఇవ్వడం) అన్నం పెట్టడం భూతయజ్ఞం అనిపించుకుంటుంది. వేదపుంగవులు, పండితోత్తములకు అన్నం పెడితే అది మనుష్య యజ్ఞం అవుతుంది. మంత్ర పఠనాన్ని బ్రహ్మ యజ్ఞం అంటారు.

ఏనాడో మన మహర్షులు అగ్నిలో ఆజ్యం వేయడంవల్ల కాలుష్య సమస్యలు నివారణ అవుతాయని, వర్షాభావం, మితిమీరిన ఎండలు లాంటి వాతావరణ అసమతుల్యత లేకుండా పొలాలు సస్యశ్యామలంగా ఉండి, దేశం సుభిక్షంగా ఉంటుందని చెప్పిన అంశాన్ని ఇన్ని వందల సంవత్సరాలు గడిచిన తర్వాత ఇప్పుడు ఆధునిక విజ్ఞానం ఆ సూత్రీకరణలు నిజమని నిర్ధారిస్తోంది. రష్యా శాస్త్రవేత్తలు మంటల్లో నెయ్యి వేయడంవల్ల పొగ, మొదలైన వాటివల్ల కలిగే వాతావరణ కాలుష్యం పోతుందని ప్రకటించారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే

1) ప్రకటన నం.eT-North-WAT-13-2024, తేది: 12.07.2024
పని పేరు: "వాల్తేరు డివిజన్ యొక్క అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ / రాయగడ అధికార పరిధి క్రింద రాయపూర్ - విజయనగరం లైన్‌పై సింగపూర్ రోడ్ - విజయనగరం స్టేషన్ల మధ్యన 39.656 TKm పొడవు కొరకు కొత్త 60 KG 110 UTS రైళ్ళతో ప్రస్తుత 60 KG 90 UTS యొక్క త్రూ రైల్ రెనివల్ (ప్రైమరీ)" సంబంధించి P.WAY పని అమలు.
పని సుమారు వ్యయం (రూ.): 2,06,55,652.03, బయానా రూ.: 2,53,300.00

2) ప్రకటన నం. eT-North-WAT-14-2024, తేది: 12.07.2024
పని పేరు: "వాల్తేరు డివిజన్ యొక్క అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ / రాయగడ అధికార పరిధి క్రింద రాయపూర్ - విజయనగరం లైన్‌పై సింగపూర్ రోడ్ - విజయనగరం మధ్యన 62.585 KM (ప్యాచ్‌లలో) పొడవు కొరకు స్టాండెడ్‌కు బల్లాస్ట్ కుషన్ పెంచడం మరియు BCM/ మాన్యువల్ ద్వారా డీప్ స్క్రీనింగ్ కలుపుకొని త్రూ బల్లాస్ట్ రెన్యువల్"కు సంబంధించి P.WAY పని అమలు.
పని సుమారు వ్యయం (రూ.): 2,48,37,671.27, బయానా రూ.: 2,74,200.00

3) ప్రకటన నం. eT-North-WAT-15-2024, తేది: 12.07.2024
పని పేరు: వాల్తేరు డివిజన్‌లో కోరాపుట్-రాయగడ లైన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్/లక్ష్మీపూర్ అధికారిక పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (P.WAY)/టికిరి అధికారిక పరిధి క్రింద టికిరి- సింగాపూర్ రోడ్ స్టేషన్ల మధ్యన 25.935 TKm పొడవు కొరకు త్రూ స్లీపర్ రెన్యువల్ (ప్రైమరీ).
పని సుమారు వ్యయం (రూ.): 6,12,20,115.97, బయానా రూ.: 4,56,100.00

4) ప్రకటన నం. eT-North-WAT-16-2024, తేది: 12.07.2024
పని పేరు: వాల్తేరు డివిజన్‌లో కోరాపుట్-రాయగడ లైన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్/లక్ష్మీపూర్ అధికారిక పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (P.WAY)/లక్ష్మీపూర్ రోడ్ అధికారిక పరిధి క్రింద కోరాపుట్-టికిరి స్టేషన్ల మధ్యన 33.169 TKm పొడవు కొరకు త్రూ స్లీపర్ రెన్యువల్ (ప్రైమరీ)
పని సుమారు వ్యయం (రూ.): 7,11,08,952.38, బయానా రూ.: 5,05,600.00
పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు (అన్ని టెండర్ల కొరకు)
టెండరు ముగింపు తేది మరియు సమయం: 05.08.2024న 15.00 గం.లకు (అన్ని టెండర్లకు)
సంస్థ లెటర్ హెడ్‌పై దాఖలు చేయబడినప్పటికీ, సకాలంలో అందినప్పటికీ కూడా సదరు టెండరు తపాలా/కొరియర్/ఫ్యాక్స్ లేదా స్వయంగా ఏవిధమైన మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు చెల్లనివిగా పరిగణించబడును మరియు ఎటువంటి పరిశీలన లేకుండా తిరస్కరించబడును.
పై ఇ-టెండరు ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లో లభిస్తుంది.
గమనిక: కాబోయే టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినటువంటి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 15 (పదిహేను) రోజులు వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg.)/ వాల్తేరు
PR-354/P/24-25

## రంగస్థల పౌరాణిక కళాకారుడు మిర్తిపాటి ఈశ్వరరావు మృతి



### వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఈశ్వరరావు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ రంగస్థల పౌరాణిక కళాకా రుడు మిర్తిపాటి ఈశ్వరరావు (75) మృతి చెందారు. జీవీఎంసీ 84వ వార్డు లో ఉన్న కొప్పాకకు చెందిన ఈశ్వర రావు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈశ్వరరావు మృతిపట్ల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తోపాటు మాజీ కౌన్సిలర్ కేఎం నాయుడు, దేవాదుల శివాజీ, రంగస్థల కళాకారులు మద్దాల జగదీశ్వరరావు, సురభి మూర్తి, సురభి రమణ, బెండపూడి రామారావు,, పొన్నాడ ముత్యాలరావు, బత్తిన సూరిబాబు, బత్తిన శ్రీను నాటకరంగానికి చెందిన పలువురు నటీనటులు తమ సంతాపం వెలిబుచ్చారు. నాటకరంగానికి ఈశ్వరరావు లేనిలోటు తీరనిది అన్నారు.మిర్తిపాటి ఈశ్వరరావు వృత్తి టైలరింగ్ ప్రవృత్తి నాటకం టైలరింగ్ వృత్తితో జీవనోపాధి సాగిస్తూ నాటక రంగం పట్ల మక్కువతో తన 15వ ఏట నుంచే నాటకాలలో నటించడం మొదలు పెట్టారు. కొప్పాకకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు స్వర్గీయ సోమేశ్వరరావు ప్రోత్సాహంతో హరిశ్చంద్ర నాటకంలో లోహిదాసు పాత్ర వేసి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు.

మాతంగి కన్య, కలహా కంటి వంటి మహిళా పాత్రలు కూడా ధరించి ప్రేక్షకులను మెప్పించారు. ఆంజనేయుడు, అంగదడుగా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారు ఈశ్వరరావు, ఈశ్వరరావు, చనిపోయే ముందు వరకు కూ డా టైలరింగ్ వృత్తి చేసుకుంటు కు టుంబాన్ని పోషిస్తూ మరోవైపు ఎన్నో నాటకాల్లో విభిన్నమైన పాత్రలుపోషించి అందరినీ ఆకట్టుకున్నారు. కొప్పాక ఈశ్వరరావు అంటే నాటకరంగంలో తెలియని వారు ఉండరు . నాటకాలు ప్రదర్శించడమే కాకుండా రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన పౌరాణిక నాటకాలను అనకాపల్లికి పరిచయం చేసిన కళాభిమాని నటుడు ఈశ్వరరావు . ఆయన కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈశ్వరరావు మృతి పట్ల కొప్పాక గ్రామ ప్రజలు ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

## ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి శశిభూషణ్ రావుని అభినందించిన విద్యార్థులు, పరిశోధ కులు, పూర్వ విద్యార్థులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర యూనివర్సిటీ కి ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్గా నియమితులైనటువంటి ప్రొఫెసర్ జి శశిభూషణ్ రావుని ఆంధ్ర యూనివర్సిటీ లైబ్రరీలో చదువు తున్నటువంటి విద్యార్థులు పరిశోధ కులు పూర్వ విద్యార్థులు కలసి అభినందనలు తెలియజేశారు అదే రకంగా లైబ్రరీలో ఉన్నటువంటి సమస్యలని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు ముఖ్యంగా గతంలో మాదిరిగా లైబ్రరీ సెలవు దినాల్లో కూడా విద్యార్థులు పరిశోధకులకు అందు బాటులో ఉంచాలని ఈ సందర్భంగా కోరారు. మెయిన్ లైబ్రరీ తో పాటుగా రీడింగ్ రూమ్ సమయాన్ని పెంచవల సిందిగా విద్యార్థులు కోరారు లైబ్రరీలో సెక్షన్స్ ఇన్చార్జీలు వేయకపోవడం వల్ల సరైన సమాచారం విద్యార్థులకి అందటం లేదు అదే రకంగా విద్యార్థుల నుంచి ఫైన్స్ ఎక్కువగా వేస్తు న్నారు సరైనటువంటి మౌలిక సదు పాయాలు కూడా అందుబాటులో లేవు జర్నల్స్ కూడా లైబ్రరీ వాళ్లు అందు బాటులో ఉంచటం లేదు మరియు ఇంటర్నెట్ ద్వారా అనేక జర్నల్స్ ఓపెన్ కూడా అవటం లేదు ఈ రకంగా పరిశోధన పడకెక్కిన సంగతి తెలిసిన విషయమే వీటితో పాటుగా లైబ్రరీలో రెండు డిప్యూటీ లైబ్రరీస్ 5 అసిస్టెంట్ లైబ్రరియన్స్ ఖాళీగా ఉన్నవి వాటిని కూడా భర్తీ చేయవలసిందిగా విసి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు డాక్టర్ ఎం సురేష్ మేనన్ ,నాని డాక్టర్ పట్నాయక్ ,రాజు, రాజ్ కుమార్, సతీష్ కుమార్, పూర్ణ రావు శశిధర్ ,రాజశేఖర్ తిరుపతి, శ్రావణి, సునీత, కౌసల్య, దీపికలు పాల్గొన్నారు.

## ఈ నెల 28న శ్రీ నూకాంబికా అమ్మవారికి శాకంబరీ అలంకరణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లి శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణం లో ఉన్న బాలాలయంలో శ్రీ నూకంబిక అమ్మ వారిని భక్తుల సహకారంతో కూరగాయలతో శాఖాంబరి అమ్మ వారిగా ఈనెల 28 ఆషాడ మాసం నాలుగవ ఆదివారం అలంకరించనునట్టు ఆలయ సహాయ కమిషనర్ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అమ్మవారి శాకంబరి అలంకరణకు అవసరమగు కూరగాయలు ఇచ్చేవారు ఆలయంలో ఇచ్చి రసీదు స్వీకరించవలసిందిగా ఆయన కోరారు.

## సాహిత్యం సామాజికత పుస్తక ఆవిష్కరణ



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక ప్రభుత్వ ఎస్ వి ఎల్ ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాహిత్యం సామజికత పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కళాశాల కు చెందిన తెలుగుదేశం అధ్యాపకురాలుడాక్టర్ సి ప్రవీణ సంకలనం చేసిన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు ఒకవైపు విద్యా బోధన చేస్తూ మరో వైపుసమాజానికి ఉపయోగ పడే పుస్తకాలను రచించడం గొప్ప విషయం అని ఆయన అన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని సంకలనం చేసిన అధ్యాపకురాలు ప్రవీనను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన సీతంపేట పిఓ



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** సీతంపేట నూతన ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం భాద్యతలు స్వీకరించిన అనంతరం పార్వతీపురంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐ టి డి ఎ ప్రాజెక్ట్ పరిధిలోని గిరిజానాభివృద్ధికి కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల ఐ టి డి ఎ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసిన శుభం బన్సల్ బదిలీపై వెళ్లిన విషయం విదితమే.

## నాగ జగదీష్ జన్మదినం సందర్భంగా 350 మంది పేదలకు రగ్గులు పంపిణీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం మాజీ శాసనమండలి సభ్యులు,తెలుగుదేశం పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు జన్మదిన వేడుకలు కార్యకర్తల సంబరాల మధ్యలో ఘనంగా జరిగాయి. మొదటిగా కేకును జగదీష్ కుమారుడు నూకేష్ వారి కుమారుడు ఆక్షజ్ కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఆహ్వాన కమిటీ సభ్యులందరూ కూడా జగదీష్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి చేసిన సేవలను వివరించారు. ముఖ్యంగా జగదీష్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి శాసనమండలి సభ్యుడు వరకు కూడా ఎదిగి తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో చిన్న నుంచి పెద్ద వరకు కూడా అందరి మధ్య కూడా చక్కని క్రమశిక్షణ యొక్క కార్యకర్తగా మెలిగాడం చాలా అభినందనీయమని వక్తలు కార్యక్రమంలో మాట్లాడారు. అనకాపల్లి పట్టణంలో ఉన్న పేద వర్గాలకు సుమారు 350 మందికి రగ్గులుని కార్యకర్తల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు కాంద్రేగుల సత్యనారాయణ మాధంశెట్టి నీలాబాబు బొడ్డేడ మురళి శంకర్ల పద్మలత మళ్ళ గణేష్ మళ్ళ శివన్నారాయణ కుప్పిలి జగన్మోహన్రావు బోడి వెంకట్రావు బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు ధనాల విష్ణు చౌదరి వెల్లూరి రమణబాబు వివిఎస్ గారు డీవీవీ అప్పారావు కర్రి మల్లేశ్వరరావు సరిపల్లి శ్రీనివాసరావు చదవడం శివ అప్పారావు పెంటకోట శివరాం కొణతాల బాల సాలపు నాయుడు కాయలు ప్రసన్న బిశెట్టి హేమ కొట్టి ఉమా కూరగాయల భారతి బుద్ధ విశ్వనాథం కాంద్రేగుల చిన్న కాంద్రేగుల రవీంద్ర ఎల్లమంచిలి బంగారు రాజు పెంటకోట వెంకటరమణ విల్లూరి సత్తిబాబు బొడ్డేడ దేవయ్య పాల్గొన్నారు. నాగ జగదీష్ జన్మదినం సందర్భంగా అనకాపల్లి బాలకృష్ణ ఫాన్స్ గౌరవ అధ్యక్షుడు పాలిమేర నాయుడు ఆధ్వర్యంలో బాలకృష్ణ అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే హ్యూమన్ రైట్స జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లిపరి వైద్యాలయంలో రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు.

## దేశ రక్షకులకు సెల్యూట్ - జిల్లా జడ్జ్ శ్రీవిద్య



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తమ ప్రాణాలను, కుటుంబాన్ని పనంగా పెట్టీ దేశం కోసం ప్రాణ త్యాగానికి వెనుకాడని సైనికులకు సెల్యూట్ అని పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ విద్య పేర్కొన్నారు. కార్గిల్ అమరవీరుల దినోత్సవం సందర్భముగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా జిల్లా జడ్జ్ మాట్లాడుతూ దేశం కోసం పోరాడుతున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజ అభివృదికి, శ్రేయస్సు కోసం కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. న్యాయవాదులు అందరూ సంఘటితంగా ఉండాలని కోరారు. అంతకుముందు న్యాయవాదులు 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమములో ఫస్ట్ అడిషనల్ జూనియర్ జడ్జ్ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం జె వి ఎన్ కుమార్, కార్యదర్శి దుర్గారావు ఉపాధ్యక్షులు రోజా తదితరులు పాల్గొన్నారు.

## కెనడాలో శరవేగంగా వ్యాపిస్తున్న అగ్నికీలలు

కెనడాలో రేగిన కార్చిచ్చు శరవేగంగా పట్టణాలకు వ్యాపిస్తున్నాయి. తాజాగా జాస్పర్ నగరాన్ని అవి తాకాయి. ముఖ్యంగా జాస్పర్‌లోకి బుధవారం సాయంత్రం అగ్నికీలలు చేరుకొన్నాయి. దాదాపు 100 మీటర్ల ఎత్తున ఎగసిపడుతున్న నిప్పు ఇక్కడి ఇళ్లు, వ్యాపార సంస్థలను కాల్చి బూడిద చేస్తోంది. ఈ మంటలు ఐదు కిలోమీటర్ల దూరాన్ని చేరుకొవడానికి కేవలం 30 నిమిషాల సమయం పట్టిందంటే.. అవి ఎంత వేగంగా వ్యాపిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

చాలామంది ఫస్ట్ రెస్పాండర్లు కూడా ఈ పట్టణాన్ని వదిలి వెళ్లిపోయారు. అల్బర్టా ప్రీమియర్ డేనియల్లీ స్మిత్ విలేకర్ల సమావేశంలో ఈ విషయం చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజలకు ఇది అత్యంత కష్టకాలమన్నారు. దాదాపు 50శాతం పట్టణం కాలిపోయినట్లు ఆమె పేర్కొన్నారు. భారీస్థాయిలో పునర్నిర్మాణ కార్యక్రమాలు జరగాల్సిఉందని పేర్కొన్నారు.

ఈ పట్టణానికి పర్యటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దాదాపు 20,000 మంది పర్యటకులు, 5,000 మంది స్థానికులు ప్రాణాలు కాపాడుకొనేందుకు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడి జాస్పర్ నేషనల్ పార్క్‌ను ఏటా 25 లక్షల మంది సందర్శిస్తారు.

జాస్పర్ సమీపంలోని రెండు కార్చిచ్చులు కలిసి మరింత ప్రమాదకరంగా మారాయని గురువారం అక్కడి నేషనల్ పార్క్ నిర్వాహకులు పేర్కొన్నారు. దాదాపు 36,000 హెక్టార్లలో ఈ మంటలు వ్యాపించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఆస్పత్రులు, ఎమర్జెన్సీ సర్వీసెస్ భవనం, పాఠశాలలు, యాక్టివిటీ సెంటర్ వంటి వాటిని మంటల నుంచి రక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, ఈ పట్టణం, సమీపంలోని నేషనల్ పార్క్‌లోని చాలావరకు వంతెనలు మాత్రం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

పార్క్స్ కెనడా నిపుణుల అంచనా ప్రకారం.. ఈ కార్చిచ్చులను పూర్తిగా ఆర్పేసేందుకు అగ్నిమాపక సిబ్బందికి కొన్ని వారాల సమయం పట్టొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ పరిణామాలపై కెనడా ప్రధాని ట్రూడో స్పందిస్తూ.. జాస్పర్ నుంచి వస్తున్న దృశ్యాలు తనను కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. అక్కడ ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సహాయక సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ ఇంటిని రక్షించేందుకు వారు శ్రమిస్తున్నారని అభిప్రాయపడ్డారు. గతేడాది జాస్పర్ వద్ద వ్యాపించిన కార్చిచ్చు దెబ్బకు మార్చి-అక్టోబర్ మధ్యలో 22 లక్షల హెక్టార్లు కాలిపోయింది.

## బాలుడిని బలిగొన్న టైరు

పటాన్‌చెరు: అవుటర్ రింగు రోడ్డుపై ఓ బాలుడు మూత్ర విసర్జన చేస్తుండగా ఎక్కడి నుంచో దొర్లుకుంటూ వచ్చిన టైరు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ ఎస్సై సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి ముత్తంగి దాబాలో భోజనం చేసేందుకు కారులో కుటుంబసభ్యులతో బయల్దేరారు. సుల్తాన్‌పూర్ వద్ద ఓఆర్ఆర్ ఎక్కిన కాసేపటికి వారి కుమారుడు మోక్షిత్‌రెడ్డి(6) మూత్రం వస్తోందని చెప్పడంతో కారు పక్కకు ఆపారు. అనంతరం బాలుడు మూత్ర విసర్జన చేస్తుండగా గుర్తుతెలియని వాహనం టైరు వేగంగా దొర్లుకుంటూ వచ్చి అతన్ని తగిలింది. తీవ్ర గాయాలు కావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన ముత్తంగిలో ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి నగరంలో మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఓఆర్ఆర్‌పై ఏదైనా వాహనం టైరు ఊడిపోయి వేగంగా దొర్లుకుంటూ వచ్చి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వర్షాకాలం ఈ 'టీ' తాగండి



వర్షాకాలం అంటే చాలామంది ఇష్టపడుతుంటారు. చల్ల చల్లని వాతావరణం, చిరుజల్లులు పడుతుంటే.. హాట్‌హాట్ స్నాక్స్ తింటూ.. వెదర్ ఎంజాయ్ చేస్తారు. కానీ ఈ వర్షాకాలం.. కూల్ ..కూల్ వాతావరణాన్నే కాదు.. ఎన్నో రోగాలను వెంట తీసుకొస్తుంది. ఈ కాలంలో అంటు వ్యాధులు, జలుబు, దగ్గు, మలేరియా, డెంగ్యూ, కడుపు ఇన్ఫెక్షన్, జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, న్యుమోనియా వంటి వ్యాధులు సర్వ సాధారణం. ఈ వ్యాధులకు దూరంగా ఉండాలంటే, వర్షాకాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కాలంలో సాధారణ రోజుల్లో కంటే మనం ఇంకాస్త జాగ్రత్తగా ఉండాలి. ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ కాలంలో సమతుల్య ఆహారం, వేడివేడి ఆహారం తీసుకోమని సూచిస్తున్నారు. అలాగే ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న, పానీయాలు తీసుకోమని సిఫార్సు చేస్తున్నారు.

**శొంఠి, ధనియాల టీ..** శొంఠిలో ఎన్నో ఔషద గుణాలు ఉన్నాయి. ఎండబెట్టిన అల్లాన్నే శొంఠి అని పిలుస్తారు. ఇది శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది. శొంఠి టీ శరీరానికి మెడిసిన్‌లా పని చేస్తుందని డా. ఐశ్వర్య అన్నారు. వర్షాకలంలో శరీరాన్ని లోపల వేడిగా ఉంచుతుందని అన్నారు. వర్షాకాలంలో జీర్ణక్రియ నెమ్మదిగా ఉంటుంది. శొంఠి జీర్ణసంబంధ సమస్యలకు చెక్ పెడుతుంది. ఈ టీ తాగితే, జలుబు, ఛాతీ వద్ద కఫం వంటి సమస్యలు రావు. శొంఠి టీ తీసుకుంటే రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. దీనిలోని యాంటీఫంగల్ లక్షణాలు ఇన్‌ఫెక్షన్స్‌తో పోరాడతాయి. ఎముకలు, కండరాల ఆరోగ్యానికి మంచిది.

. శొంఠి పొడి - 1 tsp, ధనియాలు - 1 tsp, నల్ల మిరియాలు - 1 స్పూన్, జీలకర్ర పొడి - 2 స్పూన్, బెల్లం, నీళ్లు - 3 కప్పులు, ఎలా తయారు చేయాలి..

టీ తయారు చేయడానికి, ఈ పదార్థాలన్నింటినీ కలిపి నీటిలో 15 నిమిషాలు మరగబెట్టండి. తర్వాత దాన్ని ఫిల్టర్ చేసి టీని ఎంజాయ్ చేయండి.

**తులసి-నిమ్మకాయ టీ..**

తులసి, నిమ్మరసంలో ఔషద గుణాలు పుష్కలంగా ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఈ టీ తాగితే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు. ఈ టీ వల్ల జలుబు, ముక్కు కారటం, ఫ్లూ వంటి ఇన్‌ఫెక్షన్లు దూరమవుయి. ఛాతీలో పేరుకుపోయిన కఫం కరుగుతుంది. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చినప్పుడు ఈ టీ తాగితే ఉపశమనం లభిస్తుంది. ఈ టీ తాగితే రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.

నీళ్లు - 3 కప్స్, తులసి ఆకులు - 1/2 కప్పు, నిమ్మరసం - 4 స్పూన్‌లు, ఇలా తయారు చేసుకోండి..

ఈ టీని తయారు చేసుకోవడానికి, తులసి ఆకులను 3 కప్పుల నీటిలో 10 నిమిషాలు మరిగించాలి. దీన్ని వడగట్టి అందులో నిమ్మరసం కలుపుకుని తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

**లిక్వోరైస్, పటిక బెల్లం..** లిక్వోరైస్, పటిక బెల్లం తో తయారు చేసే టీ.. వర్షాకాలంలో వేధించే గొంతు నొప్పికి దివ్యౌషదమని డా. ఐశ్వర్య అన్నారు. ఈ టీ తాగితే గొంతుకు సంబంధించి అన్ని సమస్యలు దూరమవుతాయని అన్నారు. దీంటో పాటు శరీరంలో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని అన్నారు.

. క్వోరైస్ పొడి - 3 tsp, పటిక బెల్లం- ఒకటిన్నర టీస్పూన్, నీరు - 3 కప్పులు ఇలా తాయారు చేయండి..

ఈ టీని తయారు చేసుకోవడానికి, పటిక బెల్లం కరిగే వరకు నీటిలో మరగబెట్టాలి. ఆ తర్వాత లిక్వోరైస్ పొడి వేసి 10 నిమిషాలు మరగనివ్వాలి.

# పియర్స్ పండు రోజూ తింటే.. గుండె సమస్యలు రావు



వర్షాకాలంలో పియర్స్ ఎక్కువగా దొరుకుతుంది. ఈ పండులో చాలా రకాలు ఉన్నాయి, కొన్ని ఏడాది పొడవునా దొరుకుతాయి. యాపిల్‌లా కనిపించే ఈ పండులో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ఫైబర్, ఫోలేట్, పాలీఫెనాల్ యాంటీఆక్సిడెంట్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పియర్స్ రోజూ తింటే.. ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు అంటున్నారు. పియర్స్‌లో ఉండే.. పోషకాలు అధిక కొలెస్ట్రాల్, మలబద్ధకం, డయాబెటిస్, గుండె సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి రక్షిస్తాయి. ఈ పండ్లలోని విటమిన్ సీ, ఏ వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. 100 గ్రాముల పియర్స్ పండులో 57 కేలరీలు, 15 గ్రాముల పిండి పదార్థం (కార్బోహైడ్రేట్స్), 0.1 గ్రాముల ఫ్యాట్, 0.4 గ్రాముల ప్రోటీన్, 3.1 గ్రాముల డైటరీ ఫైబర్ ఉంటుంది.

పియర్స్‌లో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో గుణాలు ఉన్నాయని అన్నారు.

**కొలెస్ట్రాల్ కరుగుతుంది..** పియర్స్‌లో పెక్టిన్ అనే కాంపౌండ్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎల్‌డిఎల్, ట్రైగ్లిజరైడ్స్, విఎల్‌డిఎల్ స్థాయిలను తగ్గిస్తుంది రోజూ పియర్స్ తింటే అధిక కొలెస్ట్రాల్ ప్రమాదం తగ్గుతుంది.

**మలబద్ధకం తగ్గుతుంది..** పియర్స్‌లో ఉండే పెక్టిన్ కారణంగా.. మలబద్ధకానికి ఔషదంలా పనిచేస్తుంది. పెక్టిన్ ఒక రకమైన ఫైబర్, ఇది జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు సహాయపడుతుంది.

**షుగర్ పేషెంట్స్‌కు మంచిది..** పియర్స్‌లో యాంటీ డయాబెటిక్ గుణాలు ఉన్నాయి. ఈ పండు డయాబెటిక్ పేషెంట్స్‌కు మేలు చేస్తుంది.మీరు డయాబెటిక్ పేషెంట్ అయితే, ప్రతిరోజూ పియర్స్ తింటే.. మీ బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది, ఇది షుగర్ పేషెంట్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.

**క్యాన్సర్‌కు చెక్..** పియర్స్ రోజూ తింటే.. మూత్రాశయం, ఊపిరితిత్తులు, ఆహార పైపులలో క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించవచ్చు. పియర్స్‌లో ఉర్సోలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది ఆరోమాటేస్ చర్యను నిరోధిస్తుంది, తద్వారా క్యాన్సర్‌ను నివారిస్తుంది. ఈ పండ్లలో ఉండే ఐసోక్వెర్‌సిట్రిన్ డీఎన్‌ఎను ఆరోగ్యంగా ఉంచుతుంది. పియర్స్ పండు యంటీ-కార్సినోజెనిక్ ప్రక్రియ చేపడుతుంది. అలాగే మృతకణాలను తొలగించి, కొత్త కణాల్ని అభివృద్ధి చేస్తాయి.

**బరువు తగ్గుతారు..** ఈ పండ్లలో తక్కువ మొత్తంలో కేలరీలు ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారు తప్పకుండా దీనిని డైట్‌లో చేర్చుకుంటే మంచిది.

**గుండెకు మేలు..** పియర్స్ పండ్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని చాలా అధ్యయనాలు పేర్కొన్నాయి. రోజు పియర్స్ తింటే గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది. వీటిలో పొటాషియం గుండెకు మేలు చేస్తుంది.

**గాయాలు తగ్గతాయి..** ఈ పండ్లలోని విటమిన్ సీ... గాయాలను తగ్గిస్తుంది. కణాలను సరిచేస్తుంది. కాలిన, తెగిన, గీసుకుపోయిన గాయలను త్వరగా నయం చేస్తుంది.

రక్తం తక్కువగా ఉన్నావారు, బలహీనంగా, నీరసంగా ఉండేవారు ఈ పండ్లను తింటే మంచి. వీటిలోని ఐరన్, కాపర్ శరీరానికి బలాన్ని ఇస్తాయి. ఎర్రరక్త కణాల సంఖ్యను పెంచుతాయి.

ఈ పండులో రాగి, కాల్షియం, పాస్పరస్, మాంగనీస్, మెగ్నీషియం ఉంటాయి. ఇవి మన ఎముకల్ని బలంగా చేస్తాయి.

# ఆలివ్స్ గుండెకు మేలు చేస్తాయి



ఆరోగ్యకరమైన ఆహారం నేటి పరిస్థితిలో చాలా ముఖ్యం. చిన్న వయసులోనే చాలా మంది ఎన్నో ఆరోగ్య సమస్యలకి గురవుతున్నారు. వాటన్నింటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే కచ్చితంగా హెల్దీ డైట్ పాటించాలి. అందులో భాగంగానే కొన్ని ఆహార పదార్థాలను మీ డైట్‌లో చేర్చుకోవాలి. అందులో బాగంగానే ఆలీవ్స్ తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చూద్దాం.

**గుండెకి మేలు చేసే ఆలివ్స్..** నేడు చాలా మంది గుండె సమస్యల కారణంగా తనువు చాలిస్తున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ సమస్యలు పెరిగిపోతున్నాయి. అందుకే ముందునుంచి జాగ్రత్తగా ఉండడం చాలా ముఖ్యం. అధికంగా కొలెస్ట్రాల్, బీపి కారణంగా గుండె సమస్యలు వస్తాయి. వీటిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. శారీరక శ్రమ, ఒత్తిడిని దూరం చేయడం వంటి వాటి వల్ల వీటిని నివారించొచ్చు. అదే విధంగా ఆరోగ్యకరమైన ఆహారం తినడం ముఖ్యం. అందులో భాగంగానే ఆలివ్స్ రెగ్యులర్‌గా తినాలంటున్నారు నిపుణులు. ఒలిక్ యాసిడ్, ఆలివ్‌లలోని ప్రధాన కొవ్వు ఆమ్లం. ఇది గుండెకి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తుంది. మరియు చెడు కొలస్ట్రాల్‌ని ఆక్సీకరణం నుండి కాపాడుతుంది.

ఆకలిని నియంత్రించే శక్తి ఆలీవ్స్‌కి ఉంటుంది. ఆలీవ్స్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ జీర్ణక్రియని నెమ్మదిస్తాయి. కోలిసిస్టోకినిన్ అనే హార్మోన్‌ని ప్రేరేపిస్తాయి. ఇది మెదడుకు కడుపు నిండిందనే భావనని ఇస్తుంది. దీని కారణంగా ఆహారం ఎక్కువగా తీసుకోం. బరువు తగ్గాలనుకునేవారు ఈ ఆలివ్స్‌ని రెగ్యులర్‌గా తింటే మంచి ఫలితాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**స్కిన్ ప్రాబ్లమ్స్..** ఆలీవ్స్.. టోకోఫెరోల్స్ అంటే విటమిన్ ఈ, టోకోట్రినాల్స్‌కి గొప్ప మూలం. ఇది కణాల పనితీరు, రోగ నిరోధక వ్యవస్థ, చర్మ ఆరోగ్యాన్ని కాపాడేందుకు తోడ్పడు తుంది. విటమిన్ ఈ అతినీలలోహిత వికిరణం నుండి చర్మాన్ని రక్షించడానికి ఏర్పడింది. కాబట్టి చర్మ కాన్సర్, అకాల వృద్ధాప్యం నుండి రక్షించడంలో సాయపడుతుంది. అంతేకా కుండా చర్మంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవు తాయి. చర్మం అందంగా మెరుస్తూ కనిపిస్తుంది. ఈ కారణం గా ఆలీవ్ నూన్, ఆలీవ్ బ్యూటీ ప్రొడక్ట్స్ చాలా ఫేమస్.

**ఆర్థరైటీస్‌కి మందులా..** ఆలివ్స్‌లో ఒలియోకాంతల్ అనే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఇన్‌ఫ్లమేటరీ COX-1, COX-2 ఎంజైమ్స్ ఏర్పడకుండా నిరోధిస్తాయి. ఈ ఎంజైమ్స్ కీళ్ళనొప్పులు, టైప్ 2 డయాబెటీస్ వ్యాధులకు ముఖ్య కారణాలు. అందుకే వీటిని తినడం వల్ల కీళ్ళ నొప్పులు దూరమవుతాయి. అదే విధంగా డయాబెటీస్ కూడా దూరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇన్ని లాభాలు ఉన్న పండుని మన డైట్లో చేర్చుకోవడం చాలా ముఖ్యం. మరింకెందుకు ఆలస్యం.

# మధుమేహం ఉన్నవారు క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి

కిడ్నీలు రక్త ప్రసరణ, శరీర పరిమాణం, రక్తపోటు స్థిరంగా ఉంచడానికి, రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి మరియు మలినాలను తొలగించడానికి సహాయపడతాయి. మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే ఇవన్నీ జరగాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ కిడ్నీలపై ఎక్కువ శ్రద్ధ వహించాలి.

ఇన్సులిన్ ఉత్పత్తి ప్యాంక్రియాస్ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేని మధుమేహం రకాలు, టైప్ 1 డయాబెటిస్ ఉన్నవారిలో 30 శాతం మంది మరియు టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో 10 నుండి 40 శాతం మంది, తగినంత ఇన్సులిన్ స్రవించని వారు మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్నారు.

మూత్రపిండాల వైఫల్యం యొక్క లక్షణాలు మూత్రపిండాల రుగ్మత సంభవిస్తే బరువు పెరుగుట చీలమండ వాపు. రాత్రిపూట తరచుగా మూత్రవిసర్జన. అధిక రక్త పోటు. మీకు మధుమేహం ఉంటే, మీరు కనీసం సంవత్సరానికి ఒకసారి రక్తం, మూత్రం మరియు రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. తద్వారా వ్యాధిని ప్రాథమిక



దశలోనే నియంత్రించవచ్చు.

రక్తంలో చక్కెర నియంత్రణ మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడం వల్ల కిడ్నీ వ్యాధి తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చు. మధుమేహ వ్యాధిగ్రస్తుల మూత్రంలో అల్బుమిన్ అధిక స్థాయిలో ఉండటం కిడ్నీ వ్యాధికి సంకేతం. మూత్రపిండాల వ్యాధిని పరీక్షించడానికి వైద్యులు నిర్ణయించడానికి చాలా రోజుల ముందు ఇది మూత్రంలో విసర్జించబడుతుంది. అందువల్ల, మధుమేహం ఉన్నవారు ఈ పరీక్షను ఏటా చేయించుకోవాలి.

ప్రమాద సంకేతం మధుమేహం నియంత్రణలో ఉన్న వ్యక్తి రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా రోజురోజుకు తగ్గిపోతే, అది కిడ్నీ రుగ్మతకు సంకేతం కావచ్చు. మధుమేహం ఉన్నవారు గుర్తించబడని పునరావృత హైపోగ్లైసీమియాకు గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి క్రమం తప్పకుండా కిడ్నీ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి.

ఏం చేయాలి? ప్రారంభ సంకేతాలను గమనించడం ద్వారా, తక్కువ రక్తంలో చక్కెర స్థాయిలను సరిగ్గా నిర్వహించవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి గ్లూకోజ్ మాత్రలు తీసుకోవడం స్వల్పకాలిక పరిష్కారాలు. చికిత్స చేయని డయాబెటిక్ హైపోగ్లైసీమియా మూర్ఛలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం మరియు అత్యవసర చికిత్స అవసరమయ్యే ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది.

# మౌత్ వాష్ వల్ల చుండ్రు పూర్తిగా పోతుంది



మౌత్ వాష్ లో యాంటీ ఫంగల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది జుట్టు రాలే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. అంటే ఫంగల్ ఇన్ఫెక్షన్లను నాశనం చేసే సామర్థ్యం దీనికి ఎక్కువ.

దానితో పాటు, జుట్టు ఆరోగ్యంగా మరియు తలనొప్పి లేకుండా ఉంచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మౌత్ వాష్ బ్యాక్టీరియాను చంపడానికి ఉద్దేశించబడింది.

చుండ్రు చాలా మంది చుండ్రుతో బాధపడుతున్నారు. చుండ్రు మీ నెత్తిమీద దురద మొదలవుతుంది, ఇది బహిరంగంగా మీకు అసౌకర్యంగా అనిపిస్తుంది. చుండ్రు సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలు చాలా షాంపూలను ఉపయోగిస్తారు. ఈ షాంపూ కొన్నిసార్లు జుట్టు రాలడానికి కారణమవుతుంది.

ఉపయోగించడం మౌత్‌వాష్‌లో ఆస్ట్రింజెంట్ గుణాలు ఉన్నాయి, ఇది జుట్టు రాలడం సమస్యలకు సహాయపడుతుంది. ఇది శిరోజాలను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో మిథైల్, మిథైల్ సాలిసైలేట్ ఉంటాయి. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ యాంటిసెప్టిక్ లక్షణాలను కలిగి ఉంది. ఇది శిరోజాలను చల్లబరుస్తుంది మరియు చుండ్రు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది.

మౌత్‌వాష్‌ని ఉపయోగించి చుండ్రుని ఎలా వదిలించుకోవాలో చూద్దాం: - మౌత్ వాష్ మరియు నీరు - బేబీ ఆయిల్ మరియు మౌత్ వాష్ - మౌత్ వాష్ మరియు ఆపిల్ సైడర్ వెనిగర్

మౌత్ వాష్ మరియు నీరు మౌత్‌వాష్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటిసెప్టిక్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి నెత్తిమీద దురద నుండి ఉపశమనం మరియు చుండ్రును నయం చేయడంలో సహాయపడతాయి.

ఉపయోగ విధానం ముందుగా 2 టీస్పూన్ల మౌత్ వాష్ కు 2 టీస్పూన్ల నీరు కలపండి. తర్వాత స్ప్రే బాటిల్‌లో పోయాలి. దీని కోసం, ముందుగా మీ జుట్టును షాంపూతో కడగాలి మరియు కండిషన్ చేయండి. తర్వాత ఈ స్ప్రేని స్కాల్ప్ పై స్ప్రే చేసి కాసేపు అలాగే ఉంచుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో మీ తలని శుభ్రం చేసుకోండి.

బేబీ ఆయిల్ మరియు మౌత్ వాష్ దరఖాస్తు యొక్క ఈ పద్ధతి పొడి మరియు కఠినమైన జుట్టు ఉన్నవారికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే బేబీ ఆయిల్ మరియు మౌత్ వాష్ ఉపయోగించడం వల్ల మీ జుట్టు పొడిబారదు.

ఉపయోగ విధానం ముందుగా 2 టీస్పూన్ల బేబీ ఆయిల్ ను 2 టీస్పూన్ల మౌత్ వాష్ కు కలపండి. అప్పుడు మీ జుట్టును షాంపూతో కడగాలి. మీరు కండీషనర్ ఉపయోగించకూడదని గమనించండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 5 నిమిషాల పాటు మసాజ్ చేయండి. అప్పుడు మీ జుట్టును షాంపూతో కడగాలి.

మౌత్ వాష్ ఇది స్కాల్ప్ ను రిలాక్స్ చేసి చుండ్రు సమస్యను దూరం చేస్తుంది. ఉపయోగ విధానం: 1 టీస్పూన్ మౌత్ వాష్ మరియు కాటన్/స్పాంజ్ తీసుకోండి. మౌత్‌వాష్‌లో స్పాంజ్‌ని ముంచి మీ తలపై రుద్దండి. 5-10 నిమిషాల తర్వాత షాంపూతో జుట్టును బాగా కడగాలి.

**ఉపయోగ విధానం:** 2 టేబుల్ స్పూన్ల మౌత్ వాష్, 2 టేబుల్ స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్, 2 టేబుల్ స్పూన్ల నీరు మరియు 1 కప్పు నీటిని స్ప్రే బాటిల్‌లో కలపండి. జుట్టును షాంపూతో శుభ్రంగా కడిగి, ఆపై కండీషనర్ రాయండి. తర్వాత ఈ స్ప్రేని మీ తలపై స్ప్రే చేయండి. ఆ తర్వాత, ఆపిల్ సైడర్ వెనిగర్‌ను నీటితో కలిపి, మీ జుట్టును కడగాలి. ఈ ఆర్టికల్ సహాయంతో, మీరు మౌత్ వాష్ ఉపయోగించి చుండ్రు సమస్యను సులభంగా ఎదుర్కోవచ్చని మేము నమ్ముతున్నాము.

# యోగా ఉదయం పూట చేయడం మంచిదేనా..!



యోగా మనసును ప్రశాంతంగా చేసే ఓ సాధన. మారుతున్న జీవన శైలి కారణంగా చాలా మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అయితే ఈ సమస్యల నుంచి విముక్తి పొందడానికి యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా కొందరు ప్రతి రోజూ యోగా చేసి అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారిని పలు నివేదికలు తెలిపాయి. ఇది శరీరానికి బలాన్నిఇవ్వడమే కాకుండా.. మనస్సు ఏకాగ్రతను పెంచుతుంది. యోగాలో చేసే సాధనను యోగాసనాలు అని పిలుస్తారు. వీటిని క్రమం తప్పకుండా చేయడం వల్ల శరీరం దృఢంగా అవ్వడమే కాకుండా అనేక రకాల శరీర సమస్యలు దూరమవుతాయని యోగా నిపుణులు తెలుపుతున్నారు.

యోగాను ప్రతిరోజూ చేయడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర శక్తి పెరగడమేకాకుండా.. భావోద్వేగాలు తగ్గుతాయని నిపుణులు పేర్కొన్నారు. అంతేకాకుండా మానసిక ఆరోగ్యం మెరుగుపడి బాడీ ఫిట్‌గా మారుతుందని యోగా నిపుణులు చెబుతున్నారు. కానీ యోగాను చాలా మంది చేయకూడని సమయాల్లో చేస్తున్నారు ఇలా చేయడం వల్ల దీని ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందలేకపోతున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**యోగాను చేసే ముందు ఈ నియమాలు తప్పకుండా పాటించాలి:**

**ఉదయం పూట యోగా చేయడం చాలా మేలు:** యోగా చేయడానికి సరైన సమయం ఉదయమని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజూ ఉదయం టిఫిన్ తినే ముందు యోగా సాధన చేయాలని పలు హెల్త్ నివేదికలు పేర్కొన్నాయి. సాధన చేసే క్రమంలో కడుపు తేలికగా, ఖాళీగా ఉండటం మంచిదని నిపుణులు తెలుపుతున్నారు.

**యోగా చేస్తున్నప్పుడు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోండి:** యోగా చేసే క్రమంలో సాధన కోసం కొంత సమయాన్ని కేటాయించండి. తద్వారా యోగా చేసేటప్పుడు మనస్సు ప్రశాంతంగా, ఒత్తిడి లేకుండా ఉంటుంది. అంతేకాకుండా శరీరాన్ని ప్రశాంత స్థితిలో ఉంచడం అవసరమని యోగా నిపుణులు పేర్కొన్నారు.

## ఉత్తర భారతీయులు దక్షిణాది భాషల అధ్యయనంతోనే జాతీయ సమైక్యత



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** త్రిభాష సూత్రం ఈ దేశానికి శ్రేయస్కరమని, హిందీ ప్రాంతీయులు తప్పనిసరిగా ఏదో ఒక దక్షిణ భారతీయ భాషను నేర్చుకోవాలని అప్పుడే జాతీయ సమైక్యత సాధ్యమని పద్మభూషణ్, విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ అన్నారు. ఆ విధంగా ముందడుగు పడనంత వరకు వారికి దక్షిణాది రాష్ట్రాల వారిని హిందీ నేర్చుకోమనే అర్హత ఉండదని హితవు పలికారు. అరవింద్ ఘోష్ - హిందీ అనే అంశంపై డిల్లీలోని యన్ డి యం సి కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ హిందీ సమ్మేళనంను ఆచార్య యార్లగడ్డ ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితులలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల వారికి హిందీని తమ మీద అనవసరంగా రుద్దుతున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. అయితే ఎవరు ఎన్ని భాషలు నేర్చుకుంటే అది వారికే లాభం తప్ప ఆ భాషకేమి ఒరగదని యార్లగడ్డ వివరించారు. కేంద్ర మంత్రి మేఘవాల్, పార్లమెంటు సభ్యులు సత్యనారాయణ్ జటియా, కె సి త్యాగి, ఆర్ కె సిన్హా అతిథులుగా హాజరయ్యారు. దేశ విదేశాల నుండి 500 మంది ప్రతినిదులు సదస్సులో పాల్గొన్నారు.

## ఘనంగా పోలమాంబ అమ్మవారి సారి కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శుక్రవారం విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలో గల జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు గ్రామదేవత శ్రీ పోలమాంబ అమ్మవారి సారి కార్యక్రమం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కరమాని వెంకట్రావు గారు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ 20వ వార్డు అధ్యక్షులు బైరెడ్డి పోతన రెడ్డి గారు, 17వ అధ్యక్షులు కాళ్ళ శంకర్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా మహా అన్న దానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** టౌన్ కొత్త రోడ్ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాలు పురస్కరించుకుని మహా అన్నదానం గురువారం ఆలయం వద్ద దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి సీతంరాజు సుధాకర్ ప్రారంభించారు. దేవస్థానం వారు 5000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ రావు, ఉరుకుటి నారాయణ రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, 36వ వార్డు కూటమి నాయకులు గణపతి, శ్రీనివాస్,వంకాయల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ డిఎం వితరణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వికలాంగులకు ఉచిత బస్సు పాస్ లు పంపిణీ స్థానిక ఏపీ ఎస్ ఆర్టీసీ కార్యాలయం లో అర్జున్ ఆధ్వర్యంలో జరిగింది. సుమారు 30 మందికి అనకాపల్లి ఏపీఎస్ఆర్టీసీ డిఎం ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది: ఈ కార్యక్రమంలో నాగ గణేష్ సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

### ఫిర్యాదు దారుల పట్ల జవాబుదారీ తనం వహించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పి అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది మమేకమై ఫిర్యాదు దారుల పట్ల జవాబుదారీతనం వహించాలని వారి సమస్యల పై సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు.

మహిళలు, బాల బాలికలపై జరిగే నేరాలు పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ఎటువంటి అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు.దొంగతనాలు మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నివారించేందుకు పగలు, రాత్రి గస్తీలను పునర్వ్యవస్థీకరించి నేరాలు నివారించేందుకు పటిష్ట గస్తీ ఏర్పాటు చేయాలన్నారు.గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మరియు రవాణా జరిగే మార్గాలలో ఆకస్మిక/ డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్ ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు.రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని, రోడ్డు భద్రతా నియమాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు.

జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సమయంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు,అనకాపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ రావు, ఎస్సై తేజేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా ముత్యామాంబ అమ్మవారి పండగ

### పాల్గొన్న టిడిపి నేత కంచర్ల



**అరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ పరిధి 13 వార్డు లో గల ఆరిలోవలో ముత్యమాంబ పండగ మహోత్సవాలు ఘనంగా జరిగింది. మహా అన్న సమారాధన కు ధన సహాయం చేసిన ఉపకార్ ట్రస్ట్ అధినేత ,తెలుగుదేశం నాయకులు కంచర్ల అచ్యుత రావు కి ఆలయ కమిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

అలాగే బుర్ర కథ కార్యక్రమానికి కూడా ధన సహాయం చేసి వారి సేవ దృక్పథాన్ని మరో సారి చాటుకున్నారు . ఏ కార్యక్రమం అయిన ట్రస్ట్ ద్వారా పేద వాళ్ళకి సేవలు అందిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ ఎం ఫోరం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పరిపల్లిరామారావు ,అమ్మ సౌండ్స్ చిన్న, సంగం ప్రెసిడెంట్ పిల్లి వీర్రాజు, సన్యాసిరావు, దేగల రాంబాబు, రాజేష్, శ్రీను, నాగు, ట్రస్ట్ ఇన్చార్జి సుధీర్, భక్తులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో సిగ్నలింగ్ వ్యవస్థ యొక్క సరైన పనితీరును నిర్ధారించడానికి చర్యలు తీసుకున్న భారతీయ రైల్వే

**విజయవాడ, (పీఐబీ):** భారీ వర్షాల నేపథ్యంలో ట్రాక్‌లో ప్రత్యేక పెట్రోలింగ్ ప్రాంతీయ వాతావరణ కేంద్రాలు మరియు జిల్లా అధికారులతో సమన్వయం సైతం నిర్ధారించడం జరిగింది.

భారతీయ రైల్వేలలో రైల్వే వంతెనలు మరియు ట్రాక్‌ల తనిఖీ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది. రైల్వే ట్రాక్‌ను నిర్ణీత ఫ్రీక్వెన్సీలో నియమించబడిన అధికారులు తనిఖీ చేస్తారు. సాధారణ నిర్వహణ కోసం నిర్దేశించిన షెడ్యూల్‌తో పాటు, సిగ్నలింగ్ వ్యవస్థ సరైన పనితీరును నిర్ధారించడానికి వర్షాకాలంలో కింది చర్యలు తీసుకోవడం జరుగుతుంది:-

(i) యార్డ్ కాలువలను శుభ్రపరచడం ద్వారా యార్డులలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుంది.

(ii) ట్రాక్ సర్క్యూట్‌ల వైఫల్యం నిమిత్తం గుర్తించిన ప్రమాదం సంభవించే అవకాశం ఉన్న ప్రదేశాలకు ముందుగానే హాజరవుతారు.

(iii) పాయింట్లు & ట్రాక్ సర్క్యూట్‌ల ఉమ్మడి తనిఖీని ట్రాక్ & సిగ్నలింగ్ అధికారులు నిర్వహిస్తారు మరియు నివారణ చర్యలు చేపడతారు.

(iv) నీరు నిలిచిపోయే అవకాశం ఉన్న ప్రదేశాలలో యాక్సిల్ కౌంటర్ అందించడం జరుగుతుంది.

గుర్తించిన విభాగాల్లో మాన్‌సూన్ పెట్రోలింగ్‌ను ప్రవేశపెట్టడం, ప్రమాదం సంభవించే అవకాశం ఉన్న ప్రదేశాలలో వాచ్‌మెన్‌లను నియమించడం, భారీ వర్షాలు కురిసినప్పుడు ట్రాక్‌లో ప్రత్యేక పెట్రోలింగ్ వంటి ప్రత్యేక జాగ్రత్తలు ఈ రుతుపవనాల సమయంలో తీసుకుంటారు. నవీకరించిన వాతావరణ సమాచారం కోసం సంబంధిత ప్రాంతీయ వాతావరణ కేంద్రాలతో మరియు రిజర్వాయర్లు/డ్యామ్‌ల నుండి అదనపు నీటి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని పొందడానికి జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ ఉంటారు.

లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన వ్రాతపూర్వక సమాధానంలో రైల్వే, ఇన్ఫర్మేషన్ & బ్రాడ్‌కాస్టింగ్ మరియు ఎలక్ట్రానిక్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ సమాచారాన్ని అందించారు.

## ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోవాలి

### పర్యావరణ ఉద్యమకారులు, వాటర్ మేన్ రాజేంద్రసింగ్

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన భౌగోళిక వారస్వ సంపదయైన ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉంటుందని పర్యావరణ ఉద్యమకారులు వాట్ మేన్ ఆప్ ఇండియా రాజేంద్రసింగ్ గారు పిలుపునిచ్చారు. ఆయన విశాఖపట్నం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముడసర్లోవ జలాశయం డంపింగు యార్డు హార్సు క్లబ్ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం భీమిలి దగ్గర వున్న ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో పర్యటించారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఎర్రమట్టి దిబ్బల విధ్వంసాన్ని ఆయనకు ప్రముఖ పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా రాజేంద్రసింగ్ గారు మీడియాతో మాట్లాడుతూ ఎర్రమట్టి దిబ్బలు పర్యావరణ సహజ సంపదని ఇలాంటి భౌగోళిక వారసత్వ సంపదలో దేశంలో ఒక్క తమిళనాడులో తప్ప మరెక్కడా లేవని అలాంటి సంపదను మనం కాపాడుకోవాలని ఈ ఎర్రమట్టి దిబ్బలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తే, ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు విశాఖ సందర్శిస్తారని తెలియజేసారు. విశాఖ మెగా సిటీకి నాలుగు వైపులా ఉన్న చారిత్రక సంపదతో దేశంలోనే ప్రాముఖ్యత



సంతరించుకుందని కొనియాడారు. ముడసర్లోవ సందర్శించి నపుడు జలాశయం కలుషితమైందని, దీనికి ప్రధాన కారణం దాని దగ్గర్లో వున్న డంపింగ్ యార్డు అని, అ డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థ పదార్థాలు జలాశయంలోకి ప్రవేశించి నీటిని కలుషితం చేస్తున్నాయని ఆయన వివరించారు. తక్షణమే ఈ జలాశయం దగ్గర డంపింగ్ యార్డు తొలగించాలని, లేనిచో ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు తాను సత్యాగ్రహం చేస్తానని హెచ్చరించారు. అలాగే జలాశయం ప్రక్కన హర్స్ క్లబ్బు ఏర్పాటు చేయడాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. హార్స్ క్లబ్బు నగరంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి జలాశయాల వద్ద ఏర్పాటు చేసి, వాటిని నాశనం చేయడం తగదని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ గారు మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ గారు విశాఖ కాలుష్యంపైన ముడసర్లోవ పరిరక్షణ పైన చాలా చిత్తశుద్ధితో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలియజేసారు. జనసేన ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన విధ్వాంసాలను జలాశయ కాలుష్యాలను నివారణ చర్యలు చిత్త శుద్ధితో పనిచేస్తుందని ఆయన అన్నారు. ప్రకృతి సిద్ధంగా విశాఖ నగరానికి భౌగోళిక వారసత్వ సంపద సహజసిద్ధంగా భగవంతుడు ఇచ్చిన ఆస్తిగా ఆయన అభివర్ణించారు. దానిని కాపాడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ అధికారులపై ఉన్నాదని తెలియజేసారు. విశాఖ పర్యావరణం నగర రియల్ ఎస్టేట్ వ్యాపారం వలన చాలా నష్టం జరుగుతుందని దీనిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎం.సి. కార్పొరేటర్ మూర్తి యాదవ్, భౌగోళిక శాస్త్రవేత్త రాజశేఖర్ రెడ్డి, పర్యావరణ వేత్త జి.వి.రత్నం, జనసేన నాయకులు శంకు వెంకటేశ్వరరావు, పీల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆమె వయస్సు 65 ఏళ్ళు

మదనపల్లె నుంచి బెంగుళూర్ కు వెళ్లిపోతోంది అక్కడ . ఓ సీనియర్ సిటిజెన్స్ హెూమ్‌కు అనగా ఓ ప్రత్యేక వృద్ధాశ్రమానికి.

ఆమె భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఆమె చదువుకున్నదే. ముగ్గురు పిల్లల పెళ్లిళ్లు చేసింది. వాళ్లందరూ అమెరికా పౌరులు. అందరికీ ఇద్దరేసి పిల్లలు. వాళ్లంతా హైస్కూల్, కాలేజీ చదువుల్లో ఉన్నారు. ఈమె అమెరికాకు బోలెడుసార్లు వెళ్లింది. కాన్పులు చేసింది.

వెళ్లిన ప్రతిసారీ ఆరు నెలలపాటు ఉండేది. ఇక చాలు అనుకుంది. ఇక తన అవసరం ఎవరికీ ఏమీ లేదు. అమెరికాకు వెళ్లాలని లేదు, రానని చెప్పేసింది. ఆరోగ్యంగా మిగిలిన జీవితం గడపాలి చాలు. అందుకే ఆమె సీనియర్ సిటిజెన్స్ హెూంకు వెళ్లిపోతోంది. వాటినే రిటైర్‌మెంట్ హెూమ్స్ అనండి. అమెరికాలో వాటినే నర్సింగ్ హెూమ్స్ అంటారుట

**ఆమె ఏమంటున్నదో చదువండి......**

'వెళ్తున్నాను ఇక తిరిగి ఎక్కడికీ రాను. నా విశ్రాంత, చివరి కాలం గడపటానికి ఓ స్థలం వెతుక్కున్నాను వెళ్లకతప్పదు. తమ పిల్లల బాగోగుల గురించి నా పిల్లలు బిజీ. ఎప్పుడో గానీ నేను వారి మాటల్లోకి రాను.

నేనిప్పుడు ... ఎవరికీ ఏమీ కాను. ఎవరికీ అక్కరలేదు.

ఆశ్రమం అంటే ఆశ్రమం ఏమీ కాదు. అది రిటైర్‌మెంట్ హెూం బాగానే ఉంది. ఒక్కొక్కరికీ ఒక సింగిల్ రూం. మరీ అవసరమైన ఎలక్ట్రికల్ పరికరాలు. టీవీ అటాచ్డ్ బాత్రూం బెడ్డు. ఏసీ కూడా ఉంది. కిటికీ తెరిస్తే బయటి గాలి, పుడ్డు కూడా బాగుంది. సర్వీస్ బాగుంది. కానీ ఇవేమీ చవుక కాదు. ప్రియమైనవే నాకొచ్చే పెన్షన్ బొటాబొటీగా ఈ అవసరాలకు సరిపోతుంది.

సరిపోదంటే నాకున్న సొంత ఇంటిని అమ్మేయాల్సిందే. అమ్మేస్తే ఇక చివరి రోజులకు సరిపడా డబ్బుకు ఢోకాలేదు. నా తరువాత ఏమైనా మిగిలితే నా కొడుక్కి వెళ్లిపోతుంది. సో, ఆ చీకూచింత ఏమీ లేదు. 'నీ ఇష్టం అమ్మా, నీ ఆస్తిని నీ అవసరాలకే వాడుకో' అన్నాడు నా వారసుడు.

వెళ్లిపోవడానికి సిద్ధమైపోతున్నాను. ఓ ఇంటిని వదిలేయడం అంటే అంత సులభమా..? కాదుగా.

బాక్సులు, బ్యాగులు, అల్మారాలు, ఫర్నీచర్, రోజువారీ మన జీవితంతో పెనవేసుకున్న బోలెడు పాత్రలు. అన్ని కాలాల్లోనూ మనల్ని కాపాడిన బట్టలు. సేకరణ అంటే నాకిష్టం. లెక్కలేనన్ని స్టాంపులు ఉన్నయ్. చాయ్ కప్పులున్నయ్. అత్యంత విలువైన పెండెంట్లు, బోలెడు పుస్తకాలు అల్మారాల నిండా అవే. డజన్లకొద్దీ విదేశీ మద్యం సీసాలున్నయ్. బోలెడంత వంట సామగ్రి ఉంది. అరుదైన మసాలాలు. ఇవే కాదు, అనేక ఫొటో అల్బమ్స్. ఇవన్నీ ఏం చేయాలి? నేను ఉండబోయే ఆ ఇరుకైన గదిలో వాటికి చోటు లేదు. నా జ్ఞాపకాల్ని అది మోయలేదు. అది భద్రపరచదు కూడాఏముంది ఆ గదిలో ? మహా అయితే ఓ చిన్న కేబినెట్, ఓ టేబుల్, ఓ బెడ్, ఓ సోఫా ఓ చిన్న ఫ్రిజ్, ఓ చిన్న వాషింగ్ మెషిన్, ఓ టీవీ, ఓ ఇండక్షన్ కుక్కర్, ఓ మైక్రోవేవ్ ఓవెన్. అన్నీ అవసరాలే. కానీ నా జ్ఞాపకాల్ని కొనసాగించే సౌకర్యాలు కావు.

నేను నా విలువైన సంపద అనుకున్న ఏ సేకరణనూ నాతో ఉంచుకోలేను. అకస్మాత్తుగా అవన్నీ నిరుపయోగం అనీ, అవి నావి కావనీ అనిపిస్తోంది. అన్నీ నేను వాడుకున్నాను, అంతే. అవి ప్రపంచానికి సంబంధించినవి మాత్రమే. నావి ఎలా అవుతాయి..?



నా తరువాత ఎవరివో. రాజులు తమ కోటల్ని, తమ నగరాల్ని, తమ రాజ్యాల్ని తమవే అనుకుంటారు. కానీ వాళ్ల తరువాత అవి ఎవరివో. నిజానికి ప్రపంచ సంపద కదా.

మనతోపాటు వచ్చేదేముంది..? వెళ్లిపోయేది ఒక్క దేహమే కదా. అందుకని నా ఇంట్లోని ప్రతిదీ దానం చేయాలని నిర్ణయించాను. కానీ అవన్నీ కొన్నవాళ్లు ఏం చేస్తారు..? నేను అపురూపంగా సేకరించుకున్న ప్రతి జ్ఞాపకం వేరేవాళ్లకు దేనికి..? వాటితో వాళ్లకు అనుబంధం ఉండదుగా. బుక్స్ అమ్మేస్తారు. నా గురుతులైన ఫొటోలను స్క్రాప్ చేసేస్తారు. ఫర్నీచర్ ఏదో ఓ ధరకు వదిలించుకుంటారు. బట్టలు, పరుపులు బయటికి విసిరేస్తారు. వాళ్లకేం పని..?

మరి నేనేం ఉంచుకోవాలి..? నా బట్టల గుట్ట నుంచి కొన్ని తీసుకున్నాను. అత్యవసర వంట సామగ్రి కొంత. తరచూ పలకరించే నాలుగైదు పుస్తకాలు. ఐడీ కార్డు, సీనియర్ సిటెజెన్ సర్టిఫికెట్, హెల్త్ ఇన్స్యూరెన్స్ కార్డ్, ఏటీఎం కార్డు, బ్యాంకు పాస్ బుక్కు. చాలు. అన్నీ వదిలేశాను. బంధం తెంచేసుకున్నాను. నా పొరుగువారికి వీడ్కోలు చెప్పాను. డోర్ వేసి, గడపకు మూడుసార్లు వంగి మొక్కుకున్నాను. ఈ ప్రపంచానికి అన్నీ వదిలేశాను.

ఎవరో చెప్పినట్టు ఏముంది.? ఓ దశ దాటాక కావల్సింది ఒక మంచం ఓ గది ...అత్యవసరాలు. మిగిలినవన్నీ గురుతులు మాత్రమే. ఇప్పుడు అర్థమవుతుంది మనకు మనకు పెద్దగా ఏమీ అక్కర్లేదు. మనం ఇకపై సంతోషంగా ఉండేందుకు మనకు ఇక ఎటూ పనికిరానివాటిని సంకెళ్లుగా మిగుల్చుకోవద్దు. వదిలేయాలి. వదిలించుకోవడమే.

కీర్తి, సంపద, భవిష్యత్తు అన్నీ ఓ ట్రాష్ లైఫ్ అంటే చివరికి ఓ పడకమంచం మాత్రమే. నిజంగా అంతే. అరవై ఏళ్లు పైబడ్డామంటే ఆలోచన మారాలి. ప్రపంచంతో అనుబంధం ఏమిటో తెలుసుకోవాలి. అంతిమ గమ్యం ఏమిటో, భవబంధాలేమిటో అర్థమవ్వాలి. మన ఫాంటసీలు, మన బ్యాగేజీతో పాటు మనం ఇక తినలేని, అనుభవించలేని, ఉపయోగించ లేనివి వదిలేయక తప్పదు. అందుకే బంధం పెంచుకోవడమే వృథా సో.....

ఆరోగ్యంగా ఉండండి. ఆనందంగా ఉండండి. ఏదీ మనది కాదు. ఎవరూ మనవాళ్లు కారు. మనిషి ఒంటరి. మహా ఒంటరి. వచ్చేటప్పుడు, పోయేటప్పుడు"..!!

**నీతి : ఎవరికి ఏం అర్థమయితే అది...**

## సెయింట్ జోసెఫ్స్ కాలేజ్ బయోలాజికల్ సైన్స్‌లో పురోగతిపై జాతీయ సదస్సు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బయోకెమిస్ట్రీ విభాగం, సెయింట్ జోసెఫ్స్ కాలేజ్ ఫర్ ఉమెన్(ఎ), 2024 జనవరి 26న మరియు 27వ తేదీ జూలై 2024న "బయోలాజికల్ సైన్స్‌లో ఇటీవలి పురోగతిపై జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, మైసూరులోని CSIR-CFTRI నుండి సీనియర్ సైంటిస్ట్ అయిన డాక్టర్ హరీష్ ప్రశాంత్ కెరీర్ ఇన్ సైంటిఫిక్ రీసెర్చ్: క్యూరియాసిటీ & ఛాలెంజెస్‌పై తన కీ నోట్ లెక్చర్‌ని అందించారు. ఆంధ్రా యూనివర్శిటీ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సుభాషిణి దేవి సిల్వర్ నానో పార్టికల్స్ మరియు క్షేత్రాల పరిధి గురించి మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో చొరవ తీసుకున్నందుకు డిపార్ట్‌మెంట్‌ను అభినందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సీనియర్ షైజీ ఈ సందర్భాన్ని అభినందించారు. కన్వీనర్ డాక్టర్ పి. మేరీ అనుపమ సభకు స్వాగతం పలికి హేతుబద్ధతను వివరించారు. హెూం సైన్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీప్రభ కళాశాల గురించి ప్రేక్షకులకు పరిచయం చేయగా, డాక్టర్ భాస్కర సుధ ఐక్యూఏసీ విజ్ఞాన యాత్రకు స్వాగతం పలికారు. ద్వితీయ భాషల హెచ్‌ఓడి డాక్టర్ పి కె జయలక్ష్మి కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమం ముగిసింది, రెండు రోజుల సమావేశానికి 150 మందికి పైగా పాల్గొనేవారు నమోదు చేసుకున్నారు.

## జిల్లాలో విజ్ఞాన వికాస కేంద్రాలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ విభాగాలు, ఇతర సంస్థల ద్వారా నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు పుస్తకాలను అందించడం కేంద్రాల లక్ష్యం. కేంద్రాలలో ఇంటర్నెట్, ఉద్యోగ నోటిఫికేషన్లు, దరఖాస్తు కోసం ఆన్‌లైన్ ప్రక్రియ, మెటీరియల్ డౌన్‌లోడ్ చేయడం, పోటీ పరీక్షల మ్యాగజైన్‌లు, దినపత్రికలు మొదలైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. వికాస కేంద్రాలు ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయి. పట్టణ ప్రాంతాల్లోనూ వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.శుక్రవారం పార్వతీపురం చర్చి వీధిలో జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ పట్టణ విజ్ఞాన వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఉద్యోగార్థుల కోసం జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులు కేంద్రాలను సొంత కేంద్రాలుగా పరిగణించాలని అన్నారు.

కేంద్రాలను మరింత మెరుగ్గా నడిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రాలను ఉదయం 8 గంటలకు తెరవడం నుండి అన్ని సౌకర్యాలు పర్యవేక్షణ చేయాలని ఆయన కోరారు. కేంద్రంలో సౌకర్యాలు కల్పించేందుకు స్పాన్సర్లు ముందుకు రావాలని కోరారు.మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బోను గౌరీశ్వరి, కమిషనర్ కె శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా నోడల్ అధికారి కె రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వైద్య సేవలు మెరుగుపరచాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** :పార్వతీపురం మన్యం జిల్లా అంటే గిరిజనులు దళితులు పేద ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతమని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అసెంబ్లీ సమావేశాల్లో తెలియజేశారు. ప్రధానంగా వైద్య సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉందని జిల్లా ఏర్పాటైన వైద్యుల నిపుణులు ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ల కొరత ఉందని వివరించారు. చాలామంది గిరిజనులు , దళితులు గాని 40 ఏళ్ళే బతుకుతున్నారని అందుకు అవగాహన లోపం పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు లేకపోవడం అని ఆయన వివరించారు అంబులెన్స్ లో కేజీహెచ్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిన గర్భిణులు కూడా ఉన్నాయని ఆయన వివరించారు. అలాగే చనిపోయిన వ్యక్తులను ఆసుపత్రులకు రోగులను తరలించే విషయాల్లో నన్ను డోలీలు భుజంమాతులు తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రి గా అప్గ్రేడ్ చేసిన పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవని అలాగే జిల్లా కేంద్రంలో స్పెషలిస్టులు లేకపోవడంతో కేజీహెచ్ వంటి ప్రాంతాలకు రిఫర్ చేయాల్సి వస్తుందని వివరించారు మెడికల్ కాలేజీ మంజూరు చేశారు . అది త్వరగా పూర్తయితే అలాగే మల్టీ స్పెషాలిటీ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తే జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆయన సభలో వివరించారు.

# కూటమి ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ సింకా గ్రాండ్ లో నిర్వహించిన ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అర్బన్ యూనిట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం జర్నలిస్టులకు టిడ్కో ఇళ్లు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అయితే ఆ ప్రక్రియ వేర్వేరు కారణాలుతో ముందుకు సాగలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకుండా ఆఖరి నిమిషంలో ప్రతీ జర్నలిస్టుకు మూడుసెంట్లు ఇళ్ల స్థలం కేటాయిస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించిన తరువాత పట్టించుకోలేదన్నారు. ఏళ్ల తరబడి జర్నలిస్టుల ఇంటి కల నెరవేరకపోవడం విచారకరమన్నారు. అలాగే అక్రిడేషన్లు, అటాక్స్ కమిటీలు పునరుద్ధరించడంతో పాటు అన్ని సంఘాలకు ఆయా కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని తాము కోరుతున్నామన్నారు. ఆయా విషయాలను తమ రాష్ట్ర కార్యవర్గం ద్వారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు



నివేదించనున్నట్లు శ్రీనుబాబు చెప్పారు. ఇప్పటికే ఆయా నేతల అపాయింట్ మెంట్లు తాము కోరడం జరిగిందన్నారు. ఏపివర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ విశాఖ పరిధిలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అలాగే పెండింగ్ సమస్యలను గుర్తించి తక్షణమే వాటిని పరిష్కరించేందుకు తమ పరిధి మేరకు ప్రయత్నిస్తామన్నారు. అన్ని పండుగల నిర్వహణతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సమావేశం లో ఫెడరేషన్ కార్యవర్గం ప్రతినిధులు ఏ. సాంబశివరావు, రవి కుమార్, పితాని ప్రసాద్. రామకృష్ణ, శివ ప్రసాద్, ఎం ఎస్సార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

**ఏపి బ్రాడ్ కాస్ట్ విశాఖ అర్బన్ నూతన కార్యవర్గం**

సమావేశం అనంతరం ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ అర్బన్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. తొలుత జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్నికల అధికారి) గంట్ల శ్రీనుబాబు నామినేషన్లు స్వీకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని శ్రీనుబాబు , నారాయణ్ లు ప్రకటించడం జరిగింది. అర్బన్ యూనిట్ బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఇరోతి ఈశ్వరరావు (మెట్రో టీవి), డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పి.నర్సింగరావు (టి.వి.9), కార్యదర్శిగా కె.మధన్ (విన్యూస్)ఉపాధ్యక్షులుగా అనురాధ (హెచ్ ఎమ్ టివి), నాయుడు (సాక్షి), కె.బాబూరావు (టి.వి 9), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.భాస్కర్ (ఈటివి), మళ్ల దేవత్రినాథ్ (విశాఖ విజన్), నాయుడు (విడిజిటల్), కోశాధికారిగా సిహెచ్ రాజశేఖర్ (ఏబిఎన్), సంయుక్త కోశాధికారిగా ఏ.సురేష్ (విడిజిటల్), జాయింట్ సెక్రటరీలుగా ఏ.శేషు (టివి-5), కోరాడ శశిభూషణరావు (సాక్షి) బి.రాజు(వీడియో జర్నలిస్టు), బి.రాము (విటివి), కార్యవర్గ సభ్యులుగా జిఆర్ ఎస్ రమేష్, ఎన్.నెలరాజు, గోపీనాథ్, బి.అప్పలనాయుడు తదితరులను ఎన్నుకోవడం జరిగింది.

# డైట్ లో బ్లాక్ చైన్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్ పై ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ అటానమస్ కళాశాల మరియు ఎన్ ఐ టి వరంగల్ అనుసంధానంతో బ్లాక్ చైన్ టెక్నాలజీస్ అండ్ అప్లికేషన్స్ పైన ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం 40గంటలు పాటూ నిర్వహించారు.

రిసోర్స్ పర్సన్స్‌గా ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్.రమేష్ బాబు ,ఎన్ ఐ టి తీర్చి అసోసియేట్ ప్రొఫెసర్ఢా కున్వార్ సింగ్,అస్సిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్ర శేఖర్ , ఎన్ ఐ టి రాయపూర్ , అసోసియేట్ ప్రొఫెసర్ రమేష్ బాబు బత్తుల , ఎన్ఐటి జైపూర్,ప్రొఫెసర్ డా.శ్రీనివాస రావు ఎన్ఐటి వరంగల్,అసిస్టెంట్ ప్రొఫెసర్ సైల్ నామసూద్ర, ఎన్ఐటి సిల్చార్ ,ప్రొఫెసర్ డాక్టర్. సురేష్ బాబు, ఎన్ఐటి వరంగల్ , ప్రశాంత్ సాహూ, టిసిస్ పాల్గొన్నారు . ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎన్ ఐ టి వరంగల్ కో ఆర్డినేటర్ గా డా. సురేష్ బాబు, కాలేజీ కో ఆర్డినేటర్ గా సి. స్. ఈ . విభాగాధిపతి డా. కె సుజాత గారు వ్యవరించారు.



ఈ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ప్రస్తుతం ఇంటర్నెట్ లో జరుగుతున్నా సైబర్ అటాక్స్ ను ఎలా బ్లాక్ చైన్ టెక్నాలజీస్ వాడి భద్రత పెంపొందించవచ్చు అనే అంశం పైన అవగానే కలిపించారు.అంతే కాకుండా ప్రసుత కాలం లో క్రిప్టో కరెన్సీ అయినా బైటికోయిన్ మరియు ఎథిరియూమ్ ఒక ప్రాముఖ్యతను . దానిని ఆ విధం గా ఉపయోగించవచ్చు అనే విషయాలను తెలియజేసారు. రానున్న రోజులలో బ్లాక్ చైన్ టెక్నాలజీస్ యొక్క ఉపజియోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల మరియు విభాగాల నుంచి అధ్యాపకులు పాల్గున్నారు. తమకి ఇటువంటి ఆధునిక టెక్నాలజీస్ అంశాల పైన అవగాహనా కలిగించినందుకు కళాశాల మానేజ్మెంట్కి కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఎన్ ఐ టి వరంగల్ వాళ్ళు తమ కళాశాల లో అనుసంధానం తో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలియజేసారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ . వైకుంఠ రావు మరిన్ని ఇటువంటి ప్రోగ్రామ్స్ ఆర్గనైజ్ చేయాలని కోరారు.డాక్టర్ సురేష్ బాబు కో ఆర్డినేటర్ గా అవకాశం ఇచ్చినందుకు కళాశాల మానేజ్మెంట్కి కృతజ్ఞతలు తెలియజేసారు.కో ఆర్డినేటర్ డాక్టర్ . కే. సుజాత మాట్లాడుతూ దేశ వ్యాప్తం గా విస్తరించి ఉన్న వివిధ యూనివర్సిటీ లు నుండి ప్రొఫెస్సార్స్ పాల్గున్నారు అని తెలియ జేసారు.

సి .స్.ఇ విభాగాధిపతి.కె సుజాత , డీన్ అడ్మిన్ ఈశ్వర్ రావు , అకాడమిక్స్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్ , వివిధ విభాగ అధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు ఆద్వర్యంలో జిల్లా బి.జే.పి నాయకులు అనకాపల్లి జిల్లా కలెక్టర్ "విజయ కృష్ణన్" ని మరియు జిల్లా ఎస్.పి "దీపిక" ని వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకముగా కలవడం జరిగింది. ఈ సందర్భముగా జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడపాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు , జిల్లా ప్రదాన కార్యదర్శులు బి.వి.యస్ వర్మ, పట్టాబి ప్రసాద్, ఏ.కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పాలమరసెట్టి నాగేశ్వరరావు, వనం సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు ఓరుగంటి నాగమణి, సంతోషి కుమారి, కిసాన్ మోర్చా జిల్లా ప్రదాన కార్యదర్శి శేషగిరిరావు గారు, మరియు మండల అధ్యక్షులు నర్సింగ్ యధవ్, కరక సత్యనారాయణ, మారిసెట్టి భాస్కరరావు, కప్పిరి తాతారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటలు దెబ్బతిన్న రైతులకు ఉచిత వరి విత్తనాలు ఇచ్చి ఆదుకోండి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ సంవత్సర ఖరీఫ్‌కు వేసిన వరి విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక వర్షపాతం వలన వరినారు పూర్తిగా మునిగి, పనికి రాకుండా పోయిందని దీనితో అనకాపల్లి సౌత్ 1,2 అనకాపల్లి మండలం కశింకోట మండలాల్లో రైతులు నష్టపోయి, దిక్కు తోచని స్థితిలో ఉన్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి,పులికాలువా సంఘం సభ్యులు

సూరిశెట్టి రమణ అప్పారావు

తెలిపారు. వ్యవసాయ అధికారులు సబ్సిడీ పై విత్తనాలు అందరికీ సకాలంలో యిచ్చారని, కాని కాలం కలసి రాక అధిక వర్షపాతం తో రైతులు నష్టపోయారన్నారు .యిటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ఉచితంగా, రైతులకు విత్తనాలు యిచ్చి వారిని కాపాడాలని రమణ అప్పారావు కోరారు.దీనిపై జిల్లా వ్యవసాయ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి వరి విత్తనాలు రప్పించేందుకు కృషి చేయాలని కోరారు. దీనితోపాటు ప్రభుత్వం రైతు భరోసా కూడా యిస్తే నష్టపోయిన రైతుకు చేదోడుగా ఉంటుందని రమణ అప్పారావు అన్నారు.

# ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** దేశ రక్షణకు ప్రాణాలర్పించిన వీర సైనికుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. భారతీయ యువమోర్చా, మాజీ సైనికుల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన విజయ దివాస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. యుద్ధంలో మరణించిన సైనికుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించి ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1999 జూలై 26వ తేదీన కార్గిల్ యుద్ధంలో మన సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా విజయ్ దివాస్ జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశ రక్షణకు సైనికులు తమ ప్రాణాలు అర్పించారని, పాకిస్తాన్ దురాక్రమణను త్రిప్పికొట్టారన్నారు. సైనికులు వారి కుటుంబ సభ్యులు చేసిన త్యాగాల ఫలితంగా దేశంలో లోపల మనం ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. మనమంతా సైనికుల త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని, దేశ రక్షణ, అభివృద్ధికి యువత పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం బారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బి జె పి కన్వీనర్ సొండి సంజీవ్ మాస్టర్ భారతీయ యువ మోర్చా ప్రతినిధులు, మాజీ సైనికులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జైలును పరిశీలించిన న్యాయమూర్తి రమేష్




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి సబ్ జైల్ ను మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ మరియు 11 వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రమేష్ పరిశీలించారు. జైల్లో ఖైదీలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన నిందితులకు ఉచిత న్యాయ సహాయ అవకాశం కల్పిస్తామన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైల్లో సమస్యలు ఉంటే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. జైల్లో లోంచి బయటకు వెళ్ళాక చెడు కు దూరముగా వుండాలన్నారు. జైల్ సూపర్డెంట్ గణేష్ రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం,రోజా, తులసి, ఎమ్ ఎల్ ఎస్ సి ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు జలమయమైన ఎన్టీఆర్ కాలనీ పరిశీలించిన ఉగ్గిన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కసింకోట మండలం పరవాడ పాలెం గ్రామం ఎన్టీఆర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా జలమయమైంది. కాలనీవాసుల ఇబ్బందులను తెలుసుకొని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి శుక్రవారం కాలనీ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో మాట్లాడుతూ ఈ సమస్యను మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ నియోజక వర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యన్నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బలిజి ముసిలి నాయుడు,ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వరరావు,శానాపతి కృష్ణ,మడక శ్రీను, పక్కుర్తి కామరాజు,రెడ్డి గణేష్,మామిడి నాగేంద్ర,మామిడి రాజు, జగతా రాజేంద్ర,సలాది సతీష్,కలగా గంగాధర్, మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సినిమా



## విజయ్ సేతుపతి మూవీపై కత్రినాకైఫ్ రివ్యూ

విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ 'మహారాజ'. విభిన్న కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలో దూసుకెళ్తోంది. తాజాగా ఈ చిత్రాన్ని వీక్షించారు బాలీవుడ్ నటి కత్రినాకైఫ్. సినిమాపై తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. ఇది తనకెంతో నచ్చిందన్నారు.

"వాట్ ఏ ఫిల్మ్.. సినిమా చాలా బాగుంది. కథను తెరకెక్కించిన విధానం అత్యద్భుతంగా ఉంది" అని పేర్కొన్నారు. దీనిపై చిత్రబృందం ఆనందం వ్యక్తంచేసింది.

విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రమిది. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రూ.20 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు తెలుస్తోంది.



విజయ్ సేతుపతి - కత్రినాకైఫ్ గతంలో 'మేరీ క్రిస్మస్' కోసం కలిసి పని చేశారు. సేతుపతి నటన అంటే తనకెంతో ఇష్టమని.. ఆయన అద్భుతమైన నటుడని అన్నారు. ఆయన సింప్లిసిటీ తనకెంతో నచ్చుతుందన్నారు.

కథేంటంటే: మహారాజా (విజయ్ సేతుపతి) ఓ బార్బర్. ఒక ప్రమాదంలో భార్యను పోగొట్టుకుంటాడు. అతనికంటూ మిగిలిన ఒకే తోడు కూతురు జ్యోతి. తను ఆ బిడ్డతోనే కలిసి సిటీకి దూరంగా ఉన్న ఓ ఇంట్లో జీవిస్తుంటాడు. మహారాజా ఓరోజు ఒంటి నిండా గాయాలతో పోలీస్‌స్టేషన్ గడప తొక్కుతాడు. ముగ్గురు అగంతకులు తన ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేశారని.. ఈ క్రమంలోనే తమ బిడ్డ ప్రాణాల్ని కాపాడిన లక్ష్మిని ఎత్తుకెళ్లిపోయారని.. ఎలాగైనా ఆ లక్ష్మిని వెతికి పెట్టమని పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. మరి మహారాజా చెప్పిన ఆ లక్ష్మి ఎవరు? అతని ఫిర్యాదును స్వీకరించడానికి పోలీసులు తొలుత ఎందుకు నిరాకరించారు? అసలు మహారాజాపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులెవరు? వాళ్లకు అతనికి ఉన్న విరోధం ఏంటి? అన్న ఆసక్తికర అంశాలతో ఈ సినిమా తెరకెక్కింది.

## నాలుగు సంవత్సరాలు ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా: నాగ్ అశ్విన్



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ' సూపర్ హిట్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఎంతోమంది అగ్ర నటీనటులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా 'కల్కి'లో తారాగణం ఎంపికపై నాగ్ అశ్విన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

"కల్కి' స్క్రిప్ట్ రాయడానికి చాలా సమయం పట్టింది. ముఖ్యంగా నటీనటుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా. బహుశా మేము ఇప్పటివరకు చేసిన సినిమాల్లో వీఎఫ్ఎక్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఉన్న చిత్రమిదే. దీనికోసం నాలుగు సంవత్సరాలు ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. 'కల్కి' క్లైమాక్స్‌ను చిత్రీకరించడం అన్నిటికంటే పెద్ద సవాలుగా అనిపించింది. వందల మంది ఆర్టిస్టులు కావాలి. క్లిష్టమైన వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు అవసరం. ప్రతి దాన్ని మా సొంతంగా డిజైన్ చేసుకున్నాం. చిత్రంలోని అగ్ర నటీనటుల పాత్రలన్నిటికీ ప్రాధాన్యం ఉండేలా చూశాం. మహాభారతంలో ఎంతో కీలకమైన అశ్వత్థామ పాత్రకు అమితాబ్‌ను తప్ప మరొకరిని ఊహించుకోలేదు. దేశంలోని పెద్ద స్టార్‌లలో ఆయన ఒకరు. ఆయన మాత్రమే ఈ పాత్రను మరింత శక్తిమంతంగా చేయగలరనిపించింది. అమితాబ్, ప్రభాస్‌ల మధ్య పోరాట సన్నివేశాలు తీయాలనేది నా కల. వాళ్లు ఈ చిత్రాన్ని అంగీకరించగానే ఎంతో ఆనందించా' అని చెప్పారు.

ఇక విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'కల్కి' ఇప్పటివరకు ఎన్నో రికార్డులు సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.1100 కోట్లు వసూళ్లను సాధించింది. ఇతిహాసాలతో కూడిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచింది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ లాంటి ప్రముఖ నటుల కీలకపాత్రలు, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ లాంటి యంగ్ హీరోల అతిథి పాత్రలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందునుంచీ భైరవగా సందడి చేసిన ప్రభాస్.. చివరిలో కర్ణుడిగా కనిపించి 'పార్ట్ 2'పై అంచనాలు పెంచేశారు.

## ఆ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినందుకు బాధపడ్డా: టబు

తెలుగు సినీ ప్రియులకు సుపరిచితురాలైన నటి టబు. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోన్న ఆమె తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. తన సినీ కెరీర్ ఎలా మొదలైందో చెప్పారు. అలాగే, ఇన్నేళ్ల కెరీర్‌లో ఓ ప్రాజెక్ట్ విషయంలో తాను విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఆ ప్రాజెక్ట్ ఎందుకు అంగీకరించానా అనే భావన కలిగిందన్నారు.

"నటి షబానా అజ్మీ మాకు బంధువు. ఓసారి నేను ఆమె ఇంటికి వెళ్లినప్పుడు ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు శేఖర్‌కపూర్ నన్ను చూశారు. నాతో 'దుష్మణి' సినిమా చేయాలనుకుంటున్నట్లు ఇంట్లో వాళ్లతో చెప్పారు. అప్పుడు నేను పదోతరగతి చదువుతున్నా. చదువుపై ఆసక్తి ఉండటంతో సినిమాల్లోకి రానని చెప్పా. ఆయన చాలాసార్లు అడగడంతో చివరకు అంగీకరించా. పదోతరగతి పరీక్షలు రాసి.. సినిమాకు సంతకం చేశా. ఏమైందో ఏమో తెలియదు. ఆదిలోనే అది ఆగిపోయింది. ఆ తర్వాత అదే చిత్రాన్ని సన్నీదేవోల్, మనీషా కొయిరాలాతో డైరెక్టర్ బంటీ తెరకెక్కించారు. కొంతకాలం తర్వాత శేఖర్ మళ్లీ నన్ను కలిశారు. 'ప్రేమ్'లో నటించమని అడిగారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నానని చెప్పా. కాకపోతే ఆయన బలవంతం చేయడంతో



అంగీకరించా. సినిమాకు సంతకం చేశా. షూటింగ్ మొదలయ్యాక ఆయన సినిమా నుంచి వైదొలగారు. దాంతో దాదాపు ఐదేళ్లపాటు ఆ ప్రాజెక్ట్ చిత్రీకరించారు. ఆ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినందుకు ఎంతో బాధపడ్డా" అని టబు తెలిపారు.

'మాసుమ్', 'మిస్టర్ ఇండియా', 'ఎలిజిబెత్' వంటి చిత్రాలను శేఖర్ తెరకెక్కించారు. ఇక, టబు సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తున్నారు. ఇటీవల 'క్రూ'తో అలరించారు.

## రైటర్‌గా నాని..



'హాయ్ నాన్న'తో ఇటీవల మంచి విజయాన్ని అందుకున్నారు నటుడు నాని. ప్రస్తుతం ఆయన తన తదుపరి సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఇదిలాఉండగా, ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం నెట్టింట వైరల్‌గా మారింది. ఆయన రైటర్‌గా మారినట్లు తెలుస్తోంది. 'హిట్ 3' కోసం ఆయన కథ రాస్తున్నారని.. దానిని ఆధారంగా చేసుకుని దర్శకుడు శైలేశ్ కొలను స్క్రిప్ట్ సిద్ధం చేయనున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

ఇటీవల తెలుగులో వచ్చిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రాల్లో 'హిట్'కు విశేష ప్రేక్షకాదరణ సొంతమైంది. 'హిట్' యూనివర్స్‌లో భాగంగా ఇప్పటికే రెండు చిత్రాలు విడుదలై మంచి విజయాన్ని అందుకున్నాయి. దర్శకుడిగా శైలేశ్‌కు గుర్తింపు తెచ్చిపెట్టాయి. వీటికి కొనసాగింపుగా 'హిట్ 3' తెరకెక్కించనున్నట్లు దర్శకుడు ఇప్పటికే ప్రకటించారు. ఇందులో నాని హీరోగా కనిపించనున్నారు. అర్జున్ సర్కార్‌గా నటించనున్నారు. అయితే, ఈ చిత్రంలో రానా ప్రతినాయకుడి పాత్ర పోషించనున్నారని సమాచారం. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికగా కనిపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నాని ప్రస్తుతం 'సరిపోదా శనివారం' కోసం వర్క్ చేస్తున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. నాని-వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో విభిన్నమైన కథతో తెరకెక్కుతున్న రెండో సినిమా ఇది. ఇందులో నాని మాస్‌లుక్‌లో కనిపించనున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలకపాత్రలో నటిస్తున్నారు. ఇది చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమా పూర్తైన తర్వాత నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబోలో ఓ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. 'హిట్ 3'ని సైతం త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు, శైలేశ్ కొలను ఈ ఏడాది 'సైంధవ్'తో ప్రేక్షకులను అలరించారు.

## 'దేవర' సాంగ్ అప్‌డేట్ ఇచ్చిన శేఖర్ మాస్టర్..?



'దేవర' సాంగ్‌కు సంబంధించి శేఖర్ మాస్టర్ అప్‌డేట్ ఇచ్చారు. ఓ చిట్‌చాట్‌లో ఎదురైన ప్రశ్నపై ఆయన స్పందించారు. "దేవర'లో కంపోజ్ చేయబోయే పాట ఎలా ఉంటుందో చూసి చెప్పాలి. మీ అందరికీ నచ్చుతుందనుకుంటున్నా. డ్యాన్స్‌కు ప్రాధాన్యమున్న గీతమిది. రెండు రోజుల్లో షూటింగ్ ప్రారంభం కానుంది" అని తెలిపారు. మరోవైపు, బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న సినిమాలోని పాటకు, విజయ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'లోని సాంగ్‌కు నృత్య రీతులు సమకూర్చానని చెప్పారు.

ఎన్టీఆర్ సినిమాల్లోని 'బంతిపూల జానకి', 'లవ్ మీ అగైన్', 'దివి నుంచి దిగి వచ్చావా యాపిల్ బ్యూటీ' వంటి హిట్ పాటలకు శేఖర్ మాస్టరే కొరియోగ్రఫీ చేశారు. మరోసారి ఈ కాంబినేషన్ రిపీట్‌కావడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమే 'దేవర'. ఈ సినిమాలోని మరో పాటకు బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ పని చేశారు. సింపుల్ స్టెప్పులతో ఎన్టీఆర్ అదరగొట్టారని ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తీర ప్రాంతం నేపథ్య కథతో ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగం సెప్టెంబరు 27న విడుదల కానుంది. జాన్వీ కపూర్ ఈ సినిమాతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే.

## 'యేవం' (ఆహా) మూవీ రివ్యూ!

ఈ మధ్య కాలంలో ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పై థ్రిల్లర్ కథలకు ప్రాధాన్యత పెరిగిపోయింది. అందువలన ఈ తరహా కథలను ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అలా క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గా 'యేవం' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జూన్ 14వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజున 'ఆహా'లో స్ట్రీమింగ్ కి వచ్చింది. చాందినీ చౌదరి .. జై భరత్ రాజ్ .. వశిష్ఠ సింహా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా కథేమిటనేది చూద్దాం.

ఈ కథ 'వికారాబాద్' లో జరుగుతుంది. అక్కడి పోలీస్ స్టేషన్ లో అభి ( జై భరత్ రాజ్) గంగాధర్ (గోపరాజు రమణ) పనిచేస్తూ ఉంటారు. అదే ఊరుకి చెందిన సౌమ్య (చాందినీ చౌదరి) ఆ పోలీస్ స్టేషన్ లోనే పోస్టింగ్ వస్తుంది. తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా, కావాలనే ఆమె ఆ వృత్తిని ఎంచుకుంటుంది. వికారాబాద్ పరిధిలో ఏ సమస్య తలెత్తినా ఈ పోలీస్ టీమ్ వెళ్లి పరిష్కరిస్తూ ఉంటుంది.

అలాంటి పరిస్థితుల్లోనే వారి ముందుకు కొత్తగా ఒక సమస్య వస్తుంది. సహజంగానే కాలేజ్ అమ్మాయిలకు సినిమా స్టార్స్ అంటే క్రేజ్ ఉంటుంది. అందువలన ఫలానా హీరోతో డిన్నర్ .. ఫలానా హీరోతో డాన్స్ చేసే ఛాన్స్ అంటూ, అమ్మాయిలను ట్రాప్ చేయడం జరుగుతూ ఉంటుంది. ముందుగా అలాంటివారి బారిన కీర్తి అనే అమ్మాయి పడుతుంది. ఆ తరువాత అనూష అనే అమ్మాయి ప్రాణాలనే పోగొట్టుకుంటుంది. ఆ కేసుకు సంబంధించి, యుగంధర్ అనేపేరు తెరపైకి వస్తుంది.

అభి వ్యక్తిత్వం నచ్చడంతో సౌమ్య అతణ్ణి ఆరాధించడం మొదలుపెడుతుంది. అప్పుడు అతను తనకి ఆల్రెడీ పెళ్లి అయినట్టు చెబుతాడు. కొన్ని కారణాల వలన తన భార్య తనని వదిలేసి వెళ్లిపోయిందని అంటాడు. ఆమె ఆశించినట్టుగా ఉండటం తన వలన కాదనీ, అందువల్లనే ఆమెను గురించి తాను ఆలోచించడం లేదని చెబుతాడు. అంత మంచి మనిషిని ఆమె ఎలా వదిలిపోయిందా అని సౌమ్య ఆలోచనలో పడుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లోనే గంగాధర్ కూతురు పెళ్లి పనుల్లో సౌమ్య పాలుపంచుకుంటుంది. ఆ సమయంలో శిరీష ఇంటికి వెళ్లిన ఆమెకి వాళ్ల మాటలు కొత్త అనుమానాలను రేకెత్తిస్తాయి. దాంతో ఆమె ఆ దిశగా దృష్టి పెడుతుంది. శిరీషను ఎవరో దారుణంగా హత్య చేశారనే విషయం అప్పుడు ఆమెకి తెలుస్తుంది. అప్పుడు సౌమ్య ఏం చేస్తుంది? శిరీషను చంపిందెవరు? యుగంధర్ ఎవరు? అతని నేపథ్యం ఏమిటి? అనేది కథ.

ఎక్కడో ఎవరో హత్యలు చేస్తుంటారు. హత్య చేయాలనుకున్నవారిని ట్రాప్ చేయడంలో .. హత్య చేయడంలో హంతకుడు ఒకే పద్ధతిని ఫాలో అవుతూ ఉంటాడు. అతణ్ణి పట్టుకోవడానికి పోలీస్ లు ప్రయత్నిస్తూ ఉంటారు. ఎవరబ్బా ఆ హంతకుడు? దొరికితే చూద్దామని ప్రేక్షకులు అనుకుంటారు. ఫలానావారు అయ్యుండొచ్చు అనే ఊహాగానాలు చేస్తారు. వాళ్లందరి అంచలనాలకు అందకుండా దర్శకుడు మరెవరినో చూపించి షాక్ ఇస్తాడు.

ఇలాంటి కథలు ఇంతకుముందు చాలానే వచ్చాయి. అయితే కథనం ఆసక్తికరంగా ఉన్న కంటెంట్ ను ప్రేక్షకులు ఎక్కువగా ఆదరిస్తూ వచ్చారు. ఇక ఈ కంటెంట్ విషయానికి వస్తే, అటు క్రైమ్ .. ఇటు సస్పెన్స్ కలిసి ప్రేక్షకులను థ్రిల్ చేయలేకపోయాయి. ఇక దర్శకుడు ఎంచుకున్న ఈ కథ కాస్త సంక్లిష్టంగా అనిపిస్తుంది. 'అపరిచితుడు' సినిమాలో హీరోకి ఉన్న 'స్ప్లిట్ పరసనాలిటీ' అనే పాయింటును టచ్ చేశారు.

ఆ సినిమాలో విక్రమ్ లోపలి మనిషి విక్రమ్ గానే కనిపిస్తాడు. కానీ ఇక్కడి పాత్రలోని లోపలి మనిషి మారిపోతాడు. అంటే ఆర్టిస్టులు మారిపోతారన్న మాట. సాధారణమైన పరిస్థితుల్లో ఒక ఆర్టిస్ట్ ..



మానసిక అసహజస్థితికి లోనైనప్పుడు మరో ఆర్టిస్ట్ కనిపిస్తాడు. ఈ తేడా తెరపై ఉన్న మిగతా పాత్రలకి తెలియదు. ప్రేక్షకులకు మాత్రం తెలుస్తుంది. ఈ గందరగోళమే ప్రేక్షకులను అయోమయంలో పడేస్తుంది.

ఇక హత్యలు చేయడానికి హంతకుడు ఎంచుకున మార్గం .. అతను హత్యలు చేయడానికి కారణం .. ఇన్వెస్టిగేషన్ సాగే తీరు ఏదీ కూడా ఆసక్తిని కలిగించదు. పోనీ ఎవరు ఈ హత్యలు చేస్తున్నారో చివరివరకూ చెప్పకుండా ఉంటే బాగుండునని అనుకంటే, ఆ సస్పెన్స్ ను కాస్త ఇంటర్వెల్ కి రివీల్ చేశారు. ఇక ఇక్కడి నుంచి కథను ఫాలో కావాలో లేదో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ కథకు తగినట్టుగానే అనిపిస్తాయి. ఎలాంటి ట్విస్టులు లేకుండా సాదాసీదాగా సాగిపోయే రొటీన్ కంటెంట్ ఇది.

## కమిటీ కుర్రోళ్ళు' వచ్చేశారు.. ట్రైలర్ చూశారా?




నిహారిక కొణిదెల సమర్పణలో రూపొందిన తాజా చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషించారు. యదు వంశీ దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

# గంజాయి బ్యాచ్ పై కఠిన చర్యలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ నగర పోలీస్ కమిషనర్ గా భాద్యతలు చేపట్టిన డాక్టర్ శంఖబ్రత బాగ్చీని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి,జీవీఎంసీ 33 వ వార్డు క్లస్టర్ ఇన్చార్జ్,టిడిపి రాష్ట్ర బీసీ గవర సామాజిక వర్గం సాధికారక సమితి సభ్యురాలు తిరుమల దేవి చక్రవర్తి శుక్రవారం పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ మిచ్చి శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమ బహూకరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జీవీఎంసీ 33 వ వార్డులో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న యువత గంజాయి,డ్రగ్స్ కు అలవాటు వాటిని సేవించి వార్డు పరిధిలోని వెంకటేశ్వర మెట్ట,కంఠం వారి వీధి,కొల్లి వారి వీధిలో ఉన్న మరుగుదొడ్ల,ఎంజీఎం స్కూల్ వద్దనున్న జీవీఎంసీ వాటర్ ట్యాంక్,కుమ్మరి వీధి కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న ఈ ప్రాంతాలలో వీటిని సేవిస్తూ స్థానిక ప్రజలను పలువిధాలుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తనకు వార్డు ప్రజలనుంచి అనేక పిర్యాదులు అందుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కమిషనర్ వెంటనే టూ టౌన్ లాండ్ ఆర్డర్ వారికి ఫోన్ చేసి వారం రోజుల్లో అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెంటనే గంజాయి సేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రశాంత విశాఖలో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

# దక్షిణ నియోజకవర్గం భూ సమస్యలు పరిష్కరించాలి

## అసెంబ్లీలో బలంగా తన వాణి వినిపించిన వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నగరంలో ప్రధానంగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఎండోమెంట్ భూ సమస్యలపై తన వాణి వినిపించారు.

విశాఖపట్నంలో ఎండోమెంట్ భూ సమస్య ప్రధానంగా ఉంది. సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల సమస్యతోపాటు విశాఖ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఈ సమస్య ఉంది. ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గం లోని పది ప్రాంతాల్లో ఈ ఎండోమెంట్ సమస్య తీవ్రంగా ఉందని అసెంబ్లీలో ప్రస్తావించారు.

ఇక్కడ వందేళ్ల పైగా నివాసం ఉన్నప్పుడు అవన్నీ చిన్న గ్రామాలు. ఆయా ప్రాంతాల్లో భూముల్ని 22 ఏ లో పెట్టి దేవస్థానం భూములుగా డిక్లేర్ చేస్తున్నారు. దీనివల్ల నియోజకవర్గంలో ఇల్లులు చిన్న రిపేర్లు చేసుకోవాలన్న, అపార్ట్మెంట్లు రీ కన్స్ట్రక్షన్ చేసుకోవాలన్న దేవదాయ శాఖ అధికారులు ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్పీకర్ దృష్టికి తీసుకుని వెళ్లారు.

అక్కడ ప్రజలు తమ పిల్లలు చదువులు కోసం, ఇతర అవసరాల కోసం తమ స్థలాలపై రుణాలు తీసుకునే అవకాశం లేకుండా నిరుపయోగంగా ఉన్నాయి.

వెంకటేశ్వర మెట్ట, అల్లిపురం, పూజ వారి పాలెం, ఎల్లమ్మ తోట, జగదాంబ, మహారాణిపేట, దేవు పాలెం, జెండా చెట్టు, చెంగల్రావుపేట, వక్ఫ్ బోర్డుకు సంబంధించి అంగడి దెబ్బ, పీతాని దెబ్బ ప్రాంతాల్లో ఈ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ సమస్య గురించి సంబంధిత అధికారులతో చర్చించగా దేవదాయ ధర్మాదాయ శాఖలో చట్టాలు చేయడం చాలా కష్టంగా ఉందని బదులిచ్చారని వివరించారు.

ఈ ఒక్క నియోజకవర్గంలోనే 19 ఎకరాల్లో ఎండోమెంట్ స్థల సమస్యలు ఈ ఉన్నాయి. ఈ సమస్య వల్ల సుమారు లక్ష, లక్ష50 వేల మంది ఇబ్బందులు పడుతున్నారని స్పీకర్ దృష్టికి తీసుకుని వెళ్లారు.దేవుడు కూడా ప్రజలు బాగుండాలని కోరుకుంటాడు కావున మంచి మనసుతో ఉపముఖ్యమంత్రి ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎండోమెంట్ భూ సమస్యలను సీరియస్ గా తీసుకొని సంబంధిత మంత్రితో ఒక కమిటీ వేసి విశాఖపట్నం ప్రజలకు ముక్తి కలిగించాలని ముఖ్య మంత్రి ఉప ముఖ్యమంత్రి లను కోరారు.

ఈ సమస్య తీరితే దక్షిణ నియోజకవర్గ ప్రజలు పండగ చేసుకుంటారని తెలిపారు.

# మడ అడవుల సంరక్షణ-మన అందరి బాధ్యత




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మడ అడవుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక సమత కళాశాల మరియు జి.వి.ఎం.సి ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ వారి ఆధ్వర్యంలో మడ అడవుల సంరక్షణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి శ్రీ దివ్య (జూ ఎడ్యుకేషన్ అధికారి) గారు మాట్లాడుతూ ఈ మడ అడవులు నదులు సముద్రములో కలిసే ప్రాంతాల్లో ఉప్పు నీటిని తట్టుకొని పెరిగే వృక్షజాతి అడవులని, ఇవి సముద్ర తీర ప్రాంతాలకు రక్షణ కవచంగా ఉంటాయని, వరదల నుండి తుఫానుల నుండి నేల కోతకు గురి కాకుండా కాపాడుతుందని తెలియజేశారు.అనంతరం కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ఈ మడ అడవుల వలన మనకు ఎంతో లాభం ఉందని అటువంటి అడవులను రొయ్యల సాగు కోసం పామాయిల్ చెట్లు వంటి సాగు ద్వారా ఈ అడవులను కొట్టి వేస్తున్నారని, దీనివలన పర్యావరణంలో కార్బన్ ప్రవేశించి భూమి వేడెక్కుట జరుగుతుందని కావున మడ అడవులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ & కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్. విజయ రవీంద్ర, మరియు వృక్షశాస్త్ర అధ్యాపకురాలు రాజ్ ప్రవీణ, ఎన్.ఎస్.ఎస్ పి.ఓ లు డాక్టర్ బి. రాజేష్ కుమార్, జి .రామకృష్ణ గారు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణపై అవగహన



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక 3 వ డివిజన్ ఎగువపేట లో సీజనల్ వ్యాధుల నివారణ పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది ఫ్రైడే డ్రై డే కార్యక్రమం లో భాగం గా జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ను 3 వడివిజన్ కార్పొరేటర్ గంటా అప్పలకొండ ప్రారంభించారు. అనంతరం ఎగువపేట తదితర ప్రాంతాలలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భం గా కార్పొరేటర్ గంటా అప్పలకొండ మాట్లాడుతూ సీజనల్ పరం గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని ఆమె కోరారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం లో తరుచు సంభవించే వ్యాధులు ఎక్కువగా దోమలు ద్వారానే వస్తాయని, దోమల నివారణకు ప్రజలు ఇండ్ల వద్ద నీటిని ఎక్కువగా నిలవ చేయరాదని, ఇంటిని, పరిసరాలను కూడా ఎల్లప్పుడూ పరిశుభ్రం గా ఉంచికోవాలని అంటూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ సిబ్బంది అన్ని ప్రాంతాలలో పారిశుధ్యాన్ని ఎల్లప్పుడూ మెరుగుపరుస్తారని ఆమె స్పష్టం చేసారు. కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ బుద్ధ మహలక్ష్మి నాయుడు, మలేరియా ఇన్స్పెక్టర్ సూరిబాబు, కె శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు చురకల రమణ, పుక్కిళ్ల లక్ష్మి కుమారి, కొక్కిరి అప్పన్న, నర్సింగ రావు, ఎల్లయమ్మ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చెందిన భారతదేశం కోసం కార్గిల్‌విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



**విజయవాడ, (పీఐబీ):** 2047 నాటికి భారతదేశాన్ని గొప్ప, శక్తివంతమైన దేశంగా మార్చేందుకు, కార్గిల్ యుద్ధంలో సాధించిన చిరస్మరణీయ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గుంటూరు ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ ఫొటో ఎగ్జిబిషన్‌లో సమావేశమైన కళాశాల విద్యార్థులు మరియు ఎన్‌సిసి క్యాడెట్‌లను ఉద్దేశించి వారు ప్రసంగించారు.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన తర్వాత మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి 2047 నాటికి అభివృద్ధి పరంగా భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. యువత చిత్తశుద్ధితో కృషి చేస్తేనే ఉజ్వల లక్ష్యం నెరవేరుతుందని ఎమ్మెల్యే మాధవి అన్నారు. దేశం శాంతియుతంగా ఉండేందుకు, అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూసేందుకు సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని ఆమె అన్నారు.

ఈ సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవిత పరీక్షల్లో విజయం సాధించేందుకు సన్నద్ధతను కొనసాగించాలన్నారు. జీవితానికి, కార్గిల్ యుద్ధానికి మధ్య ఉన్న సారూప్యతలను వివరిస్తూ, చారిత్రక సంఘటనలు భవిష్యత్తు తరాలకు కొన్ని పాఠాలను మిగులుస్తాయని అన్నారు. విజయంలో క్రమశిక్షణ, సంసిద్ధత కీలకమని చెప్పారు. ఎమ్మెల్యేలు ఇద్దరూ ఎక్సిబిషన్ లో కార్గిల్ యుద్దానికి సంబంధించిన వివిధ చిత్రాల వివరాలను వివరంగా తెలుసుకున్నారు.

ఎన్ సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ 1999లో కార్గిల్ యుద్ధంలో అధిక ఎత్తులో జరిగిన యుద్ధంలో సైన్యం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. అయితే, భారతదేశం తన ఆయుధాలను మరియు యుద్ధ వ్యూహాలను ఆధునీకరించి, తిరుగులేని శక్తిగా ఎదిగిందని ఆయన అన్నారు.

పీఐబీ మరియు సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి సమాచార & ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ కార్యకలాపాలను వివరించారు. సవాళ్లను ఆత్మవిశ్వాసంతో స్వీకరించి, ఫలితాలను వినయంతో స్వీకరించాలని విద్యార్థులను చైతన్యపరిచారు.

దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో సైనికులు చేసిన అత్యున్నత త్యాగాలను స్మరించుకునేందుకు సమాచార & ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీబీసీ, అందరికీ అందుబాటులో ఉండేలా మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు దేశభక్తి నినాదాలతో ర్యాలీకి నాయకత్వం వహించగా, సిబిసి ఫీల్డ్ ఆఫీసర్ ఆర్ రమేష్ చంద్ర మరియు ఎన్‌సిసి అధికారి విజయ్ మోహితే జెండా ఊపి ప్రారంభించారు. సీబీసీ వివిధ కళాశాలల్లో కార్గిల్ విజయ దివస్ సిల్వర్ జూబ్లీ థీమ్‌పై వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ మరియు డ్రాయింగ్ పోటీలను కూడా నిర్వహించింది.

# మండలం లో డ్రై డే కార్యక్రమం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మండలం లో పలు గ్రామ పంచాయితీల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమం జరిగింది. భీమిలి మండలంలో అమనాం పంచాయతీ లో నర్సయ్య పేట , తాళ్ళవలస పంచాయితీ ఆర్ తాళ్లవలస , టి . నగరపాలెం పంచాయితీ తదితర గ్రామాల్లో ఆరోగ్య శాఖ సిబ్బంది ,స్వయం సహాయక సంఘం సభ్యులుకలిసి సీజనల్ వ్యాధుల నివారణ పై అవగహన ర్యాలీ నిర్వహించబడినది. అనంతరం ఏర్పాటైన సమావేశంలో పాల్గొన్న వక్తలు మలేరియా, డెంగ్యూ మరియూ టైఫాయిడ్ వంటి వెక్టర్ బోర్న్ డిసీజెస్ ఈ సీజన్ నందు ఎక్కువగా ప్రభలుతున్న దృష్ట్యా, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, దోమల నివారణ పై సంఘ సభ్యులుకు అవగాహన కల్పించి,దీని నిమిత్తము దోమలు పెరగ కుండా ఉండుటకు ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో వివిధ గ్రామాలలో డ్రై డే నిర్వహించి దోమలు గుడ్లు పెట్టే ప్రదేశాలు అయినటువంటి నీరు నిల్వ ఉండే కుండీలు,ఫ్రిడ్జ్ వెనుక భాగం, కూలర్, ఏసీ, పూల కుండీలు, వాటికింద ఉండే ప్లేట్ లు,తాగి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఎలా శుభ్రచాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో తాళ్ళ వలస గ్రామ ఉప సర్పంచ్ బుజ్జి రాజు పంచాయతీ సెక్రటరీ వైవి రామకృష్ణ, సీసీమణి, అమనాంఏపీఎం బి.రంగారావు, సీసీ అప్పల నారాయణ, ఆరోగ్య సిబ్బంది, విఓఎస్ తదితరులు పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.